ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



అనంతపురం

జిల్లా వార్తలు

శుక్రవారం 13 సెప్టెంబరు 2024



తవ్వుకో.. తవ్వుకో..!

వైసీసీవారితో కలిసి
టీడీపీ నేత దందా

- రియల్ వెంచర్లకు మామిళ్లపల్లి కొండ మట్టి
- భారీ యంత్రాలు, టిప్పర్ల వినియోగం


గుత్తిలో ప్లాట్లకు తోలిన ఎర్రమట్టి

ఎర్ర మట్టికోసం ప్రభుత్వ భూములను గుల్ల చేస్తున్నారు. అధికారుల అండతో చెలరేగిపోతున్నారు. గుత్తి మండల పరిధిలోని మామిళ్ళచెరువు కొండలు, ప్రభుత్వ భూముల్లో భారీ యంత్రాలతో యథేచ్ఛగా తవ్వకాలు జరుపుతున్నారు. వైసీపీ హయాంలో మట్టి మాఫియా దెబ్బకు మామిళ్లచెరువు కొండ కరిగిపోయింది. తామేమీ తక్కువ తినలేదన్నట్లు తాజాగా తెలుగుదేశం పార్టీకి చెందిన ఓ చోటా నాయకుడు, ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారి దందాకు తెరలేపారు. గుత్తి పట్టణంలోని బీసీ కాలనీకి చెందిన ఎక్స్‌కవేటర్‌తో మామిళ్లచెరువు కొండ ప్రాంతంలో భారీగా ఎర్రమట్టిని తవ్వుతున్నారు. టిప్పర్లతో గుత్తి పట్టణ శివారు ప్రాంతాలలో రియల్ వెంచర్లకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ఇద్దరు వైసీపీ నాయకులను సైతం టీడీపీ చోటా నాయకుడు కలుపుకోవడం గమనార్హం. వైసీపీకి చెందిన మున్సిపాలిటీ పాలకవర్గ సభ్యులలో ఒకరి పొలానికి ఈ మట్టిని తరలిస్తున్నారు. అందులో రియల్ వెంచర్ ఏర్పాటు దిశగా పనులు సాగుతున్నాయి. అధికార పక్షం, విపక్షం అన్న తేడా లేకుండా నాయకులు కలిసిమెలిసి మట్టి దందా చేయడం చూసి జనం ముక్కున వేలేసుకుంటున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ఎర్రమట్టి టిప్పరు రూ.4 వేల నుంచి రూ.5 వేల ధర పలుకుతోంది. రోజూ రూ.లక్షల్లో దందా సాగుతోంది. మైనింగ్, రెవెన్యూ, పోలీసు అధికారులు అటువైపు కన్నెత్తి చూడటం లేదు. వైసీపీ హయాంలో గుత్తి శివారు ప్రాంతంలోని గుట్టలను కరగదీసి మట్టిని అమ్మేశారు. ఆ తరువాత చదును చేసి ప్లాట్లు వేసి అమ్ముకున్నారు. ప్రభుత్వం మారినా.. పద్ధతి మారకపోవడం సరికాదని ప్రజలు అంటున్నారు. ఇలా అయితే తాము వేసిన ఓట్లకు విలువ ఏముంటుందని నిట్టూరుస్తున్నారు. మామిళ్లపల్లి వద్ద మట్టి తవ్వకాలకు అనుమతి లేదని, అక్కడ మట్టి తవ్వకాలకు పాల్పడితే చర్యలు తప్పవని తహసీల్దారు ఓబులేసు హెచ్చరించారు.

- గుత్తి రూరల్

చదువు ఇష్టం లేక..!


పావని (ఫైల్)

పుట్లూరు, సెప్టెంబరు 12: గాండ్లపాడు గ్రామానికి చెందిన జూటూరు పావని (19) చదువు కోవం ఇష్టంలేక ఆత్మహత్య చేసుకుందని పోలీసులు తెలిపారు. రామాంజులరెడ్డి, రమాదేవి దంపతుల కూతురు పావని, కోయంబత్తూరులోని ఓ కాలేజీలో బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. చదువడం ఇష్టం లేదని, మానేస్తానని తరచూ తల్లిదండ్రులకు చెప్పేది. వినాయకచవితికి ఇంటికి వచ్చిన పావని, బుధవారం రాత్రి అందరూ నిద్రపోయాక స్టోర్ రూంలోకి వెళ్లి చీరతో ఉరివేసుకుంది. ఉదయమే లేచిన తల్లిదండ్రులు కూతురును చూసి బోరున విలపించారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ హేమాద్రి గ్రామానికి వెళ్లి పరిశీలించారు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసుకుని దర్యాప్తు ప్రారంభించారు.

అప్పులు తీర్చలేక..


ఓబిలేసు(ఫైల్)

గార్లదిన్నె, సెప్టెంబరు 12: మండల పరిధిలోని మర్తాడు గ్రామ రైతు ఓబిలేసు(35) అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్నాడు. ఓబిలేసు, ధరణి దంపతులకు రెండు ఎకరాల పొలం ఉంది. వేరుశనగ సాగు చేస్తూ జీవనం సాగించేవారు. మూడేళ్ల నుంచి వ్యవసాయంలో నష్టం రావడంతో అప్పులు రూ.6 లక్షలకు చేరాయి. వాటిని తీర్చే మార్గంలేక ఓబిలేసు గురువారం తన ఇంట్లో ఉరివేసుకున్నాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని సీఐ కౌలుట్లయ్య, ఎస్ఐ మహమ్మద్‌గౌస్ తెలిపారు. ఓబిలేసుకు భార్య కుమారుడు, కూతురు ఉన్నారు.

ఐఏబీ సమావేశం వాయిదా బాధాకరం

వైసీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి


మాట్లాడుతున్న అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం క్రైం, సెప్టెంబరు 12: తుంగభద్ర డ్యాంలో నీరు పుష్కలంగా ఉన్నా రైతాంగానికి ఇవ్వలేని పరిస్థితిలో ప్రభుత్వం ఉందని వైసీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి విమర్శించారు. జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన ఆయనను పార్టీ శ్రేణులు గురువారం కలిసి శుభాకాంక్షలు తెలియజేశాయి. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల్లో పార్టీ ఓటమిపై సమీక్షించుకుంటామని, క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేస్తామని అన్నారు. ఈ ఏడాది ఖరీఫ్‌లో ఉమ్మడి జిల్లా రైతాంగం ఏకంగా 5 లక్షల ఎకరాలలో విత్తనం వేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి అధికారంలోకి వచ్చి మూడు నెలలైందని, పింఛన్లు ఇవ్వడం మినహా చేసిందేమీ లేదని విమర్శించారు. వాగ్దానాలు నెరవేర్చలేక, సమస్యలను పక్కదారి పట్టించేందుకు డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని అన్నారు. ఈ క్రమంలోనే వైసీపీ శ్రేణులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని అన్నారు. ఇరిగేషన్ అడ్వయిజరీ బోర్డు సమావేశాన్ని తక్షణం నిర్వహించి, నీటి కేటాయింపులు, తేదీలు ఖరారు చేయాలని డిమాండ్ చేశారు. తాగు, సాగు నీటి అవసరాల కోసం హెచ్ఎల్‌సీకి తక్షణమే నీరు విడుదల చేయాలని కోరారు.

రాళ్లతో కొట్టి చంపేశారు..!


నూరుల్లా (ఫైల్)

తాడిపత్రి, సెప్టెంబరు 12: పట్టణంలోని కమ్మవారి వీధిలో గురువారం రాత్రి నూరుల్లా (34) అనే వ్యక్తిని కొందరు రాళ్లతో కొట్టి చంపేశారు. వివాహేతర సంబంధమే ఈ హత్యకు కారణమని పోలీసులు తెలిపారు. పట్టణ సీఐ సాయిప్రసాద్ తెలిపిన మేరకు, పడమటిగేరి ప్రాంతానికి చెందిన నూరుల్లా, అర్జాస్ స్టీల్ పరిశ్రమలో కార్మికుడు. కమ్మవారివీధి సమీపంలో ఉంటున్న ఓ మహిళతో కొన్నాళ్లుగా వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడు. ఈ క్రమంలో గురువారం రాత్రి పని ముగించుకుని ద్విచక్రవాహనంపై ఆమె ఇంటి వద్దకు వెళ్లాడు. అక్కడ ఆమె బంధువులు ఎదురుపడి, ఎందుకొచ్చావని ఆగ్రహం వ్యక్తం చేశారు. మాటామాట పెరిగి నూరుల్లాపై రాళ్లతో విచక్షణారహితంగా దాడిచేశారు. తలకు తీవ్రగాయాలు కావడంతో నూరుల్లా అక్కడికక్కడే మృతిచెందాడు. దాడిచేసినవారు అక్కడి నుంచి పరారయ్యారు. సంఘటనా స్థలాన్ని సీఐ సందర్శించి, మృతదేహాన్ని పరిశీలించారు. నూరుల్లాకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

నైతిక విలువలు పాటించాలి

డీఎల్ఎస్ఏ కార్యదర్శి శివప్రసాద్


మాట్లాడుతున్న న్యాయాధికారి

అనంతపురం క్రైం, సెప్టెంబరు 12: చదువుకునే వయసు నుంచే నైతిక విలువలు పాటించాలని జిల్లా న్యాయసేవ అధికార సంస్థ కార్యదర్శి శివప్రసాద్ యాదవ్ సూచించారు. అరవింద నగర్‌లోని బీసీ, ఎస్సీ, ఎస్టీ వసతి గృహాలను ఆయన గురువారం సందర్శించారు. వసతులు సరిగా ఉన్నాయా లేదా అని పరిశీలించారు. లీగల్ సర్వీసెస్ అథారిటీ చట్టం, బాల్య వివాహాల నిరోధక చట్టం, విద్యాహక్కు, పిల్లల హక్కులు, గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు.


బీకేఎస్‌లో బహుళ ప్రయోజన గోదాముల నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కలెక్టర్

గోదాముల నిర్మాణం
పూర్తి చేయండి: కలెక్టర్

బుక్కరాయసముద్రం, సెప్టెంబరు 12: బహుళ ప్రయోజన గోదాముల నిర్మాణ పనులను రెండు వారాల్లోగా పూర్తి చేయాలని కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ కాంట్రాక్టర్లు, ఇంజనీర్లను ఆదేశించారు. మండల కేంద్రంలోని సిద్ధరాంపురం రోడ్డు వద్ద నిర్మిస్తున్న బహుళ ప్రయోజన గోదాములను గురువారం ఆయన పరిశీలించారు. జిల్లాలో 52 బహుళ ప్రయోజన గోదాములను నిర్మిస్తున్నామని తెలిపారు. త్వరలోనే వీటిని ప్రారంభించి, రైతులకు అందుబాటులోకి తెస్తామని అన్నారు. గోదాములలో మౌలిక సదుపాయాలు కల్పించాలని, అక్కడికి వెళ్లేందుకు వీలుగా రోడ్లు వేయాలని సూచించారు. కాంట్రాక్టర్లకు వెంటనే బిల్లులు చెల్లించాలని అధికారులను ఆదేశించారు. డీసీఓ అరుణ కుమారి, మార్కెటింగ్ ఏడీ సత్యనారాయణ, డీఈ రఘునాథ్ తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.

రోగులకు మెరుగైన వైద్యం అందించండి

పెద్దాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు


ఆస్పత్రిలో తనిఖీలు నిర్వహిస్తున్న సూపరింటెండెంట్

అనంతపురం టౌన్, సెప్టెంబరు 12: రోగులకు మెరుగైన వైద్యం అందించి, జిల్లా సర్వజన వైద్యశాలకు ఎన్ఏబీహెచ్ అక్రిడిటేషన్ తీసుకురావడానికి ప్రతి ఒక్కరూ కృషిచేయాలని వైద్యులకు సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు సూచించారు. ఆస్పత్రిలోని ఎమెర్జెన్సీ క్యాజువాలిటీ, ఐసీయూ, ట్రామా, గైనిక్, ఓపీ విభాగాలను ఆయన గురువారం పరిశీలించారు. డ్యూటీ డాక్టర్ల హాజరు, రోగుల వివరాలను తెలుసుకున్నారు. ఐసీయూలో పడకలు ఖాళీగా ఉండటంతో సీరియస్ కేసులు లేవా అని వైద్యులను ప్రశ్నించారు. పడకల ఖాళీ సమాచారం ఎప్పటికప్పుడు తెలపాలని ఆదేశించారు. వార్డులను శుభ్రంగా ఉంచాలని సూచించారు. అక్కడక్కడ అపరిశుభ్రత కనిపించడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. దగ్గరుండి శుభ్రం చేయించారు. అనంతరం హెచ్ఓడీలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఎన్ఏబీహెచ్ అక్రెడిటేషన్ రావాలంటే రోగులకు మెరుగైన వైద్యం అందించాల్సి ఉంటుందని, నిర్వహణ బాగుండాలని అన్నారు. త్వరలో ఆస్పత్రి పరిశీలనకు కమిటీ వచ్చే అవకాశం ఉందని అన్నారు. వార్డులలో వసతులు, నిర్వహణ, శుభ్రత, వైద్య సేవలపై దృష్టి సారించాలని సూచించారు. ఆర్ఎంఓలు డాక్టర్ పద్మజ, డాక్టర్ హేమలత, హెచ్ఓడీలు డాక్టర్ నవీన్‌కుమార్, డాక్టర్ శ్రీనివాస్‌శౌరి, డాక్టర్ రామస్వామినాయక్, డాక్టర్ శ్రీనివాసులు, డాక్టర్ శంషాద్ బేగం, డాక్టర్ రవికుమార్, డాక్టర్ సతీష్, డాక్టర్ శాంతిరెడ్డి, డాక్టర్ శివశంకరనాయక్, డాక్టర్ వైఎంఎస్ ప్రసాద్, నర్సింగ్ సూపరింటెండెంట్ నాగమణి తదితరులు పాల్గొన్నారు.



రెండు ఆటలూ హిట్

తొలిరోజు పరుగుల వరద.. సెంచరీతో కదంతొక్కిన ఇషాన్

దులీప్ ట్రోఫీ క్రికెట్ మ్యాచ్‌లో ఇండియా-సి బ్యాట్స్‌మన్ ఇషాన్ కిషన్ సెంచరీతో కదం తొక్కాడు. ఇండియా-బితో జరిగిన మ్యాచ్‌లో 126 బంతుల్లో 14 ఫోర్లు, మూడు సిక్సర్లతో 111 పరుగులు సాధించాడు. దీంతో తొలిరోజు ఆటముగిసే సమయానికి సి జట్టు 79 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 357 భారీ స్కోర్ సాధించింది. కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ (46), మానవ్ సుతార్ (8) క్రీజ్‌లో ఉండటంతో రెండో రోజు కూడా పరుగుల వరద పారే అవకాశం కనిపిస్తోంది. ఇండియా-ఎ, డి జట్ల మధ్య జరుగుతున్న మరో మ్యాచ్‌లో సైతం భారీ స్కోరు నమోదైంది. ఎ జట్టు తొలిరోజు ఆట ముగిసే సమయానికి 8 వికెట్లు కోల్పోయి 288పరుగులు చేసింది. క్రీజ్‌లో షాంశ్ ములానీ (88), ఖలీల్ అహ్మద్ (14) ఉన్నారు. తనుష్ కొటియాన్ 53 పరుగులు సాధించారు.

(7లో..)

బాల్య వివాహాలు చేస్తే జైలుకే

జిల్లా అధికారుల హెచ్చరిక



సమావేశంలో మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి

అనంతపురం టౌన్, సెప్టెంబరు 12: బాల్య వివాహాలు చట్ట విరుద్ధమని, తమ పిల్లలే కదా అని బాలలకు వివాహం చేస్తే జైలుకు పంపుతామని జిల్లా ఉన్నతాధికారులు హెచ్చరించారు. వికసిత్ భారత్ కార్యక్రమంలో భాగంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో గురువారం బాల్యవివాహాల నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యల గురించి ఒక్క రోజు శిక్షణా తరగతులను నిర్వహించారు. జడ్పీ సీఈఓ ఓబులమ్మ, ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి, డీఎంహెచ్ఓ డాక్టర్ ఈబీ దేవి తదితరులు మాట్లాడారు. బాల్య వివాహాల విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చాలా సీరియస్‌గా ఉన్నాయని అన్నారు. బాల్య వివాహాల నియంత్రణకు రాష్ట్ర ప్రభుత్వం 31, 39 జీఓలను జారీ చేసిందని అన్నారు. బాల్య వివాహాలను ఇన్నాళ్లు ఐసీడీఎస్, అంగన్‌వాడీలే అరికట్టారని, ఇకపై గ్రామస్థాయి నుంచి అన్ని శాఖలు బాధ్యత తీసుకోవాలని సూచించారు. వీఆర్ఓ, పంచాయతీ కార్యదర్శి మహిళా పోలీసులు బాధ్యతగా భావించి, ప్రజలలో అవగాహన పెంచాలని అన్నారు. బాల్యంలో వివాహం చేస్తే జరిగే అనర్థాల గురించి తెలియజేయాలని, చిన్న వయసులో గర్భందాల్చితే ప్రసవ సమయంలో తల్లీబిడ్డ ప్రాణాలు పోయే ప్రమాదం ఉంటుందని చెప్పాలని సూచించారు. దీంతో పాటు చట్టపరంగా తీసుకునే చర్యల గురించి అవగాహన పెంచాలని అన్నారు. జిల్లా చైల్డ్ ప్రొటెక్ట్ ఆఫీసర్ మంజునాథ్, సీడీపీఓలు ఉమాశంకరమ్మ, ధనలక్ష్మి, చైల్డ్‌లైన్ జిల్లా కో ఆర్డినేటర్ కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

చిగిచెర్ల విద్యార్థినికి బంగారు పతకం



పతకాలతో విద్యార్థినులు

ధర్మవరంరూరల్, సెప్టెంబరు 12: మండలంలోని చిగిచెర్ల విద్యార్థినులు జాతీయస్థాయిలో సత్తా చాటారు. చెన్నైలో ఈనెల 10వతేదీ నుంచి ఖేలో ఇండియా సౌత్‌జోన్ జాతీయస్థాయి సబ్‌జూనియర్ జూడో పోటీల్లో 9వ తరగతి విద్యార్థిని నందిని 32 కిలోల విభాగంలో బంగారు పతకాన్ని సాధించింది. లాస్యారెడ్డి 44 కేజీల విభాగంలో కాంస్య పతకాన్ని కైవసం చేసుకుంది. పతకాలు సాధించిన విద్యార్థులను ప్రధానోపాధ్యాయులు తిమ్మారెడ్డి, పీడీ ప్రతాప్ తదితరులు అభినందించారు.

ఆరుతడి పంటలు సాగు చేయండి

జిల్లా వ్యవసాయాధికారి ఉమామహేశ్వరమ్మ

బుక్కరాయసముద్రం, సెప్టెంబరు 12: ఆరుతడి పంటలు సాగుచేయాలని జిల్లా వ్యవయాధికారి ఉమామహేశ్వరమ్మ రైతులకు సూచించారు. గురువారం రోటరీపురం గ్రామంలో కూరగాయలు, పండ్ల తోటలను ఆమె పరిశీలించారు. భూగర్భజలాలు అడుగంటిపోతున్న తరుణంలో వరి పంట వేయడం లాభాదాయకం కాదన్నారు. రైతులు వరిని తగ్గించి ఆరుతడి పంటల సాగు చేయడం మంచిదన్నారు. ఈనెల 15వ తేదీలోగా కేవైసీ పక్రియ పూర్తి చేయాలని సూచించారు. అదేవిధంగా రైతుల సాగు చేసే పంటలను ఈ క్రాప్ తప్పని సరిగా చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఓశ్యాం సుందర్‌రెడ్డి పాల్గొన్నారు.

రిజర్వాయర్‌కు 941 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

బెళుగుప్ప, సెప్టెంబరు 12: మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్‌కు గురువారం కృష్ణాజలాల ఇన్‌ఫ్లో 941 క్యూసెక్కులు ఉన్నట్లు హంద్రీనీవా అధికారులు తెలిపారు. అలాగే ఔట్‌ఫ్లో కింద హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ ఫేజ్-2కు 831 క్యూసెక్కులు, మరువ నుంచి పీఏబీఆర్‌కు 70 క్యూసెక్కులు వెళుతున్నట్లు వెల్లడించారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి


కుళ్లాయప్ప (ఫైల్)

ధర్మవరంరూరల్, సెప్టెంబరు 12: పట్టణంలోని యాదవవీధికి చెందిన కుళ్లాయప్ప (25) గురువారం విద్యుదాఘాతంతో మృతిచెందాడు. గొట్లూరుకు చెందిన నారాయణస్వామికి స్వల్పగాయాలయ్యాయి. కుళ్లాయప్ప, నారాయణస్వామి బేల్దార్లు. మండలంలోని రేగాటిపల్లిలో కారుషెడ్డు నిర్మాణ పనులకు వెళ్లారు. ఇనుపరేకుల షెడ్డుపైన సిమెంటు దిమ్మె నిర్మిస్తుండగా.. ఇంటిపైన ఉన్న మెయిన్‌లైన్ వైరుకు కుళ్లాయప్ప ప్రమాదవశాత్తు తగిలాడు. విద్యుత్ షాక్ తగిలి, అక్కడికక్కడే మృతిచెందాడు. పక్కనే ఉనన నారాయణస్వామికి స్వల్పగాయాలయ్యాయి. రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఆటో డ్రైవర్ శ్రీనివాసులు, మల్లిక దంపతుల ఇద్దరు కుమారుల్లో కుళ్లాయప్ప పెద్దవాడు. ఇతడికి వివాహం కాలేదు.

స్కాం వెనుక ఇద్దరు..?

పరీక్షల విభాగంలో సూత్రధారి.. డీసీఈబీలో పాత్రధారి

సొంత అజెండాతో నిధుల దోపిడీకి స్కెచ్
రూ.31.80 లక్షలేకాదు.. మరింత పక్కదారి
డీఈఓకు తెలియకుండానే నడిపించారా..?




అనంతపురం విద్య, సెప్టెంబరు 12: ప్రశ్నాపత్రాలు, ఓఎంఆర్ షీట్ల ముద్రణ, సరఫరా వ్యవహారంలో జరిగిన అక్రమాల వెనుక ఇద్దరు ఉన్నతాధికారుల హస్తం ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. విద్యాశాఖ పరీక్షల విభాగంలో ఉండే ఒక ఉన్నతాధికారి కనుసన్నల్లో... డీసీఈబీలో ఉండే మరో ఉన్నతాధికారి ఈ స్కాంను అమలు చేశారని విద్యాశాఖ, ఉపాధ్యాయ వర్గాలు అంటున్నాయి. జిల్లా విద్యాశాఖ ప్రమేయం లేకుండానే ఈ తతంగం నడిచిందా..? ఈ విషయం డీఈఓకు తెలియదా..? లేక మరో కోణం ఉందా అన్న అనుమానాలు కలుగుతున్నాయి. 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించిన ఎఫ్ఏ-3 ప్రశ్నాపత్రాలు, ఓఎంఆర్ షీట్ల ముద్రణ, సరఫరా వ్యవహారం లోనే కాకుండా, డీసీఈబీ నిధులను 10వ తరగతి పరీక్షలకు కూడా మళ్లించారన్న ఆరోపణలు వస్తున్నాయి. ఈ క్రమంలో విద్యార్థులు చెల్లించిన రూ.లక్షల ఫీజులు కొందరు అధికారుల జేబుల్లోకి చేరినట్లు తెలిసింది. దీనిపై లోతైన విచారణ జరిపిస్తే మరిన్ని అక్రమాలు బయట పడే అవకాశం కనిపిస్తోంది.

ఎవరెవరు ఉన్నారు..?

జిల్లా సాధారణ పరీక్షల మండలి (డీసీఈబీ), పరీక్షల విభాగం జిల్లా విద్యాశాఖ పరిధిలోనే ఉంటాయి. ఈ రెండు విభాగాల నిర్ణయాలు, వాటి అమలు డీఈఓ పర్యవేక్షణలోనే జరుగుతాయి. కానీ జిల్లాలో ఇందుకు భిన్నంగా వ్యవహారాలు సాగుతున్నాయి. ఈ రెండు విభాగాలు పరీక్షల విభాగంలో పనిచేసే ఓ అధికారి కనుసన్నల్లో నడుస్తున్నాయి. జిల్లాలో ప్రధానోపాధ్యాయులను, సంఘాల నాయకులను కదిలిస్తే ఈ విషయం స్పష్టమౌతోంది. డీసీఈబీలో రూ.31.80 లక్షల వర్క్ ఆర్డర్‌ను డీఈఓ సంతకాలు లేకుండా సృష్టించారు. దీని వెనుక డీసీఈబీ అధికారులు ఉన్నారని, పరీక్షల విభాగంలోని ఉన్నతాధికారుల హస్తం కూడా ఉందని అంటున్నారు. డీసీఈబీ అధికారులు మాత్రమే డీఈఓ పేరు లేకుండా, జిల్లా విద్యాశాఖలోని ఏడీలు, సూపరింటెండెంట్స్, ఇతర క్లర్కుల సంతకాలు లేకుండా...కేవలం ఒక్కరి సంతకంతో రూ.31.80 లక్షల వర్క్ ఆర్డర్, ఇతర బిల్లులు సృష్టించి ఉంటారన్న అనుమానాలు కూడా కలుగుతున్నాయి.

దారి మళ్లించారా..?

ప్రతి ఏటా 10వ తరగతి పరీక్షల నిర్వహణకు ప్రత్యేకంగా బడ్జెట్ విడుదల చేస్తారు. ఆ నిధులే కాకుండా డీసీఈబీ నిధులను సైతం పది పరీక్షలకు వాడుకుటున్న ఆరోపణలు వస్తున్నాయి. డీసీఈబీ నిధులలో రూ.4 లక్షల వరకూ ఇలా పక్కదారి పట్టించారని సమాచారం. డీసీఈబీ నిధులు వాడుకుంటే రీఫండ్ చేయాలి. కానీ అడ్డదారిలో పరీక్షల కోసం వాడుకుని, ఇప్పటి వరకూ డీసీఈబీకి రీఫండ్ చేయలేదని అంటున్నారు. కొందరు అధికారులు ఏకమై.. సొంత అజెండాలో భాగంగా ఈ స్కాంకు రూపకల్పన చేసి అమలు చేసినట్లు కనిపిస్తోంది.

విచారిస్తే వెలుగులోకి..



జిల్లా విద్యాశాఖలో చాలా అక్రమాలు జరుగుతున్నాయి. డీసీఈబీలో లక్షలాది రూపాయల నిధులు పక్కదారి పడుతున్నాయి. ప్రశ్నాపత్రాలు, ఓఎంఆర్ షీట్స్ ముద్రణ, సరఫరాలో భారీ స్కాం జరిగినట్లు తెలిసింది. దీనిపై విద్యాశాఖ కమిషనర్ విచారణకు దిగాలి. లోతైన దర్యాప్తు చేస్తే ఈ స్కాం బయటకు వస్తుంది. త్వరలోనే దీనిపై ఉద్యమం చేస్తాం.

\- కుళ్లాయిస్వామి, ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి

క్రిమినల్ కేసులు పెట్టాలి..



జిల్లా డీఈఓగా వరలక్ష్మి ఫిబ్రవరిలో వచ్చారు. అలాంటప్పుడు డీఈఓ పేరిట డిసెంబరులోనే ఎలా వర్క్ ఆర్డర్ తయారు చేస్తారు..? దీని వెనుక ఎవరున్నారో తేల్చాలి. రూ.31.80 లక్షల వర్క్ ఆర్డర్‌కు నకిలీ ఉత్తర్వులు సృష్టించారు. ఇది నేరం. లోతైన విచారణ చేయాలి. బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలి.

\- పరమేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి

కలెక్టర్ చర్యలు తీసుకోవాలి..



డీఈఓ కార్యాలయం అక్రమాలకు నిలయంగా మారింది. డీసీఈబీలో పర్యవేక్షణ లోపం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. సొంత నిర్ణయాలతో లక్షలాది రూపాయలు దారి మళ్లిస్తున్నారు. దీనిపై కలెక్టర్ స్పందించాలి. రూ.31.80 లక్షల స్కాంపై విచారణ చేయించాలి. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి. భవిష్యత్తులో ఇలాంటి అక్రమాలు జరగకుండా చూడాలి.

\- నరేష్, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

ఆదర్శ కమ్యూనిస్టు

సీతారాం ఏచూరి

ఆయన మృతి కమ్యూనిస్టు ఉద్యమానికి తీరనిలోటు
సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్



నివాళులు అర్పిస్తున్న సీపీఎం నాయకులు

అనంతపురం కల్చరల్, సెప్టెంబరు 12: విద్యార్థి దశ నుంచి తుది శ్వాస విడిచే వరకు పేదల పక్షాన ఉద్యమించిన ఆదర్శ కమ్యూనిస్టు సీతారాం ఏచూరి అని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్ అన్నారు. ఆయన మృతి కమ్యూనిస్టు ఉద్యమానికి తీరని లోటన్నారు. గురువారం సాయంత్రం సీపీఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో స్థానిక గణేనాయక్ భవన్‌లో సీతారాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాంభూపాల్ మాట్లాడుతూ పుచ్చలపల్లి సుందరయ్య మార్గదర్శకత్వంలో విద్యార్థి నాయకుడిగా రాజకీయ జీవితాన్ని ప్రారంభించి సీపీఎం అఖిలభారత ప్రధాన కార్యదర్శిగా ఎదిగారన్నారు. మతోన్మాద, కార్పొరేట్ రాజకీయాల ప్రమాదాన్ని దేశ ప్రజలకు సూటిగా వివరించేవారన్నారు. వామపక్ష ప్రజాతంత్ర లౌకిక శక్తులను ఏకం చేసి ఇండియా వేదికను ఏర్పాటు చేయడంలో ఆయన పాత్ర అత్యంత కీలకమని గుర్తు చేశారు. అనంతపురం ఉమ్మడి జిల్లాలో జరిగిన అనేక కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారన్నారు. సీపీఎం, అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం ఉమ్మడి అనంతపురం జిల్లాలోని అన్ని మండల కేంద్రాల్లో సీతారాం ఏచూరికి నివాళులర్పించడంతోపాటు సంతాపసభలు నిర్వహించాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు నాగేంద్రకుమార్, నల్లప్ప, ఐద్వా రాష్ట్ర కోశాధికారి సావిత్రి, నగర కమిటీ అధ్యక్షుడు రామిరెడ్డి, ఆర్వీ నాయుడు, ప్రకాష్, సురేష్ పాల్గొన్నారు.

సీపీఐ నాయకులు..

అనంతపురం విద్య: సీతారాం ఏచూరి మరణం దేశ రాజకీయాలకు తీరని లోటని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జగదీశ్, జిల్లా కార్యదర్శి జాఫర్ గురువారం వేర్వేరు ప్రకటనల్లో దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. కమ్యూనిస్టు ఉద్యమాల్లో క్రియాశీలకంగా ఉంటూ దేశ రాజకీయాల్లో గొప్పనాయకుడిగా వెలిగారన్నారు. ఆయన మరణం బాధాకరమన్నారు. ఆయన కుటుంబానికి తమ సంతాపం తెలుపుతున్నామన్నారు.

ప్రజా ఉద్యమాలకు తీరని లోటు: కాలవ

అనంతపురం అర్బన్: సీతారాం ఏచూరి మృతి ప్రజా ఉద్యమాలకు తీరని లోటని రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నమ్మిన సిద్ధాంతాల కోసం జీవిత కాలం అలుపెరగని పోరాటం సాగించిన ఆయన మరణం దురదృష్టకరమన్నారు. తెలుగుగడ్డపై పుట్టిన ఆయన విద్యార్థి దశ నుంచి మంచి నాయకుడిగా ఎదిగారని కొనియాడారు. పార్లమెంట్‌లో, బయట ప్రజల గొంతుకగా నిలిచారన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలియజేశారు.

ఐఏబీ సమావేశం వాయిదా

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 12: ఐఏబీ సమావేశాన్ని వాయిదా వేసినట్లు చైర్మన్, కలెక్టర్ వినోద్‌కుమార్, కన్వీనర్, హెచ్ఎల్‌సీ ఎస్ఈ రాజశేఖర్ గురువారం తెలిపారు. అనంతపురం, కడప, కర్నూలు జిల్లాల ప్రజాప్రతినిధులు వరద ప్రాంతాల్లో సహాయక చర్యల్లో పాల్గొంటున్నారు. ఈ నేపథ్యంలో సమావేశాన్ని వాయిదా వేసినట్లు పేర్కొన్నారు. తదుపరి తేదీ ప్రకటిస్తామన్నారు.

పంటలను పరిశీలించిన శాస్త్రవేత్తలు


వేరుశనగ పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

గుత్తిరూరల్, సెప్టెంబరు 12: మండలంలోని కంది, ఆముదం, వేరుశనగ పంటలను రేకులకుంట శాస్త్రవేత్తలు విజయశంకర్, భాస్కర్‌రావు, లక్ష్మణ్ గురువారం పరిశీలించారు. కంది, ఆముదం, వేరుశనగ పంటలను చీడ పీడలు ఆశించాయని రైతులు వారి దృష్టికి తీసుకెళ్లారు. కందిలో ఫ్యూసేరియం విల్ట్‌ను గుర్తించి నివారణకు కాపర్ ఆక్సీక్లోరైడ్, 3 గ్రాములు ఒక లీటరు నీటీలో కలిపి పిచ్చికారి చేయాలని వారు రైతులకు సూచించారు. అదేవిధంగా ఆముదం పంటలో కాప్సూల్ బోరార్‌ను గుర్తించి నివారణకు ప్రొఫెనోపోస్ రెండు ఎంఎల్ ఒక లీటరు నీటిలో కలిపి స్ప్రే చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ వెంకటరాముడు, ఏఓ మెహరుషా బేగం, ఏఈఓ కృష్ణభగవన్ పాల్గొన్నారు.

టమోటా కిలో రూ.26

అనంతపురం రూరల్, సెప్టెంబరు 12: కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.26తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. గురువారం 3200 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ.21, కనిష్ఠ ధర రూ.15పలికినట్లు ఆయన తెలిపారు.

ఇషాన్ సెంచరీ.. చేరువలో షాంశ్ ములాని

ముకేష్ కుమార్‌కు మూడు వికెట్లు
తరలివచ్చిన విద్యార్థులు, అభిమానులు





ఇషాన్.. శతకానందం..

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 12: దులీప్‌ట్రోఫీలో ఇషాన్ కిషన్, షాంశ్ ములాని, ఇంద్రజిత్ రాణించారు. ఇండియా బి, ఇండియా సి జట్ల మధ్య స్థానిక అనంతపూర్ క్రికెట్ గ్రౌండ్ బీలో మ్యాచ్ గురువారం ప్రారంభమైంది. టాస్ గెలిచి ఇండియా బి జట్టు ఫీల్డింగ్ ఎంచుకుంది. బ్యాటింగ్‌కు దిగిన ఇండియా సి జట్టు మొదటి రోజు ఆటముగిసే సమయానికి 5 వికెట్లు కోల్పోయి 357 పరుగులు చేసింది. ఓపెనర్, కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ 46 పరుగులు చేసి రిటైర్డ్‌హర్ట్ అయ్యాడు. సాయి సుదర్శన్ 43, రజత్ పటీదార్ 40, ఇంద్రజిత్ 78 పరుగులు చేశారు. ఇషాన్ కిషన్ ఇండియా బి జట్టు బౌలర్లపై విరుచుకపడ్డాడు. 126 బంతుల్లో 14 బౌండరీలు, 3 సిక్సర్లతో 111 పరుగులు చేశాడు. ఆటముగిసే సమయానికి బ్యాటింగ్‌కు వచ్చిన రుతురాజ్‌గైక్వాడ్ 46 పరుగులు, మానవ్‌సుతార్ 8 పరుగులతో క్రీజ్‌లో ఉన్నారు. ఇండియా బి బౌలర్లు ముకేష్‌కుమార్ 3 వికెట్లు, నవదీప్‌సైనీ, రాహుల్ చాహర్ చెరో వికెట్ పడగొట్టారు.

ఏసీజీలోని ఏ మైదానంలో ఇండియా ఎ, ఇండియా డి జట్ల మధ్య జరిగింది. టాస్ గెలిచిన ఇండియా డి జట్టు బౌలింగ్ ఎంచుకుంది. బ్యాటింగ్‌కు దిగిన ఇండియా ఏ జట్టు తొలిరోజు ఆటముగిసే సమయానికి 8 వికెట్లు కోల్పోయి 288 పరుగులు చేసింది. షాంశ్‌ములాని 88 పరుగులు, ఖలీల్ అహ్మద్ 14 పరుగులతో క్రీజ్‌లో ఉన్నారు. ప్రథమ్‌సింగ్ 7, కెప్టెన్ మయాంక్ అగర్వాల్ 7, తిలక్‌వర్మ 10, రియాన్ పరాగ్ 37, షాషావత్ రావత్ 15, కుషాగ్ర 28, తనుష్‌కొటియాన్ 53, ప్రసిద్‌క్రిష్ణ 8 పరుగులు చేశారు. షాంశ్‌ములాని 8 బౌండరీలు, 3 సిక్సర్లతో ఆకట్టుకున్నాడు. ఇండియా డి బౌలర్లలో హర్షిత్‌రాణా, విద్వత్ కావేరప్ప, అర్షదీప్‌సింగ్ చెరో రెండు వికెట్లు తీశారు. శరాన్ష్‌జైన్, సౌరభ్‌కుమార్ చెరో వికెట్ పడగొట్టారు. క్రికెట్ అభిమానులు, విద్యార్థులు పెద్దఎత్తున మ్యాచ్‌ను చూసేందుకు తరలివచ్చారు. ఈలలు వేస్తూ సందడి చేశారు. దులీప్ ట్రోఫీ ఆర్గనైజింగ్ కమిటీ కార్యదర్శి షాబుద్దీన్, మాంచోఫెర్రర్, పగడాల మల్లికార్జున, ఏజేపీ తీర్థ, మచ్చా రామలింగారెడ్డి, తిమ్మప్ప, రాజగోపాల్, ఆర్డీవో వసంతబాబు, తహసీల్దార్ హరికుమార్ తదితరులు మ్యాచ్‌ను వీక్షించారు.



ములాని.. 88 నాటౌట్



మ్యాచ్‌ను వీక్షిస్తున్న వివిధ పాఠశాలల విద్యార్థులు


డ్రమ్స్ వాయిస్తూ..

పీవీ చౌదరి సేవలు మరువలేనివి

సంతాపసభలో కాలవ, దగ్గుపాటి, పల్లె


నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు తదితరులు

కొత్తచెరువు, సెప్టెంబరు 12: మాజీ ఎంపీపీ పీవీచౌదరి సేవలు మరువలేనివని రాయదుర్గం, అనంతపురం ఎమ్మెల్యేలు కాల్వశ్రీనివాసులు, దగ్గుపాటిప్రసాద్, మాజీ మంత్రి పల్లెరఘునాథరెడ్డి అన్నారు. గురువారం ఆయన సంతాపసభను కుటుంబసభ్యులు పీవీప్రసాద్, పీవీ రాంప్రసాద్, లక్ష్మీ, జ్యోతి, పీవీ శ్రీదేవి, శ్రీధర్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పీవీ చౌదరి రెండు పర్యాయాలు ఎంపీపీగా ప్రజలకు నిస్వార్థంగా సేవలు అందించారన్నారు. మాజీ ఎంపీ తలారి రంగయ్య, గ్రంథాలయ సంస్థ మాజీచైర్మన్ గౌస్‌మొయిద్దీన్, ఎస్కేయూ మాజీ రిజిస్ట్రార్ సుధాకర్‌బాబు, కర్ణాటక అడిషనల్ డీజీపీ చంద్రశేఖర్, కర్ణాటక సిటీ మాజీ కమిషనర్ రామాంజినేయులు, టీడీపీ రాష్ట్ర నాయకులు ఆలంనరసానాయుడు, నాయకులు ఎల్ నరేంద్రచౌదరి, శ్రీధర్‌చౌదరి, మంత్రిసవిత భర్త వెంకటేశ్వరరావు, సప్తగిరి బల్లా సురేశ్‌నాయుడు, సింగవరం రవి, వెంకటరెడ్డి తదితరులు పీవీ చౌదరి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

పీహెచ్‌సీ వైద్యుల సమ్మె నోటీసు

పుట్టపర్తి, సెప్టెంబరు 12: జీఓ నంబరు 85ను రద్దు చేయాలని కోరుతూ ప్రాథమిక ఆరోగ్యకేంద్రా(పీహెచ్‌సీ)ల్లో పనిచేసే వైద్యులు.. జిల్లా ఇన్‌చార్జి వైద్యాధికారి డాక్టర్ తిప్పయ్యకు గురువారం సమ్మె నోటీసు అందజేశారు. డాక్టర్ రామకృష్ణ ఆధ్వర్యంలో వైద్యులు.. స్థానిక డీఎంహెచ్‌ఓ కార్యాలయానికి చేరుకుని, నోటీసు అందజేశారు. గ్రామీణ, ట్రైబల్ ప్రాంతాల్లో పనిచేస్తున్న వైద్యుల సర్వీస్ కోటాకు నష్టం వాటిల్లేలా 85 జీఓ ఉందని డాక్టర్ రామకృష్ణ అన్నారు. వెంటనే రద్దు చేయాలని కోరారు.

వినాయక మండపం వద్ద కొడవలితో హల్‌చల్

స్పీకర్ల సౌండ్ తగ్గించాలని స్థానికుడి మండిపాటు
నిర్వాహకులతో గొడవ.. యువకుడికి గాయాలు

హిందూపురం, సెప్టెంబరు 12: వినాయక మండపం వద్ద లౌడ్ స్పీకర్ల సౌండ్ తగ్గించలేదని నిర్వాహకులపై స్థానికుడు మండిపడ్డాడు. కొడవలితో వారిపైకి వెళ్లాడు. డీఎస్పీ మహేష్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. స్థానిక లక్ష్మీపురంలోని భజనమందిరం సమీపాన వినాయక విగ్రహం ఏర్పాటు చేశారు. బుధవారం రాత్రి 10 గంటలు దాటినా లౌడ్‌స్పీకర్లు పెట్టి సౌండ్ ఎక్కువ పెట్టారు. సమీపంలోనే నివాసముంటున్న శ్రీహరి అనే వ్యక్తి తల్లి అనారోగ్యంతో బాధపడుతోంది. దీంతో సౌండ్ తగ్గించాలని వినాయక మండల నిర్వాహకులను పలుమార్లు శ్రీహరి కోరాడు. వారు తగ్గించకపోవడంతో ఇంట్లోని కొడవలి తీసుకుని, మండపం వద్ద హల్‌చల్ చేశాడు. అక్కడున్నవారు అడ్డుకున్నారు. ఈ సందర్భంలో పాండురంగ అనే యువకుడి చేతికి స్వల్పగాయాలయ్యాయి. మద్యం మత్తులో ఉన్న శ్రీహరికి స్థానికులు దేహశుద్ధి చేసి, టూటౌన్ పోలీసులకు అప్పగించారు. దీనిపై దర్యాప్తు చేస్తున్నట్లు డీఎస్పీ తెలిపారు.

దొంగ అన్నందుకు కత్తితో దాడి

హిందూపురం, సెప్టెంబరు 12: స్థానిక రహమత్‌పురానికి చెందిన ఇంతియాజ్‌పై అల్లాబకాష్ అలియాస్ అల్లు అనే యువకుడు బుధవారం అర్ధరాత్రి కత్తితో దాడిచేశాడు. డీఎస్పీ మహేష్ తెలిపిన వివరాల మేరకు.. రహమత్‌పురంలో అల్లాబకష్‌ను ఇంతియాజ్ దొంగ అన్నాడు. దీంతో తీవ్ర కోపంతో రగిలిన అల్లాబకష్ పక్కన మటన్‌షాపులోని కత్తి తీసుకుని, కుడిచేయి మీద నరికాడు. కడుపు, వీపుభాగంలో కత్తితో పొడిచాడు. తీవ్ర రక్తస్రావం కాగా.. పక్కనే ఉన్నవారు.. కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఇంతియాజ్‌ను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం బెంగళూరు తీసుకెళ్లారు. కత్తితో దాడిచేసిన అల్లాబకష్ ద్విచక్రవాహనాల చోరీ కేసులో ఉన్నాడు. వీరిద్దరు తాగిన మైకంలో ఉన్నట్లు డీఎస్పీ తెలిపారు. దీనిపై కేసు నమోదు చేశామన్నారు.

యువతి అదృశ్యంపై కేసు నమోదు

గోరంట్ల, సెప్టెంబరు 12: మండలంలోని కరావులపల్లి తండాకు చెందిన శశికళాబాయి అదృశ్యమైనట్లు సీఐ శేఖర్ తెలిపారు. శంకర్‌నాయక్ కుమార్తె శశికళాబాయి బూదిలి వద్ద ఉన్న కియ అనుబంధ పరిశ్రమలో పనిచేస్తోంది. ఈనెల 10న ఉదయం ఉద్యోగానికి వెళ్లి ఇంటికి రాలేదు. బంధువుల వద్ద ఆరాతీసినా ప్రయోజనం లేకపోవడంతో తండ్రి పోలీసులను ఆశ్రయించాడు. అతడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

15న ధర్మవరానికి మంత్రి సత్యకుమార్ రాక

ధర్మవరం, సెప్టెంబరు 12: రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్ ఈనెల 15న ధర్మవరానికి రానున్నట్లు డీపీఆర్ఓ వర్గాలు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 17వతేదీ వరకు ఉమ్మడి జిల్లాలోని పలు కార్యక్రమాల్లో పాల్గొంటారన్నారు.

రేపు జాతీయ లోక్ అదాలత్

అనంతపురం క్రైం, సెప్టెంబరు 12: ఉమ్మడి జిల్లా పరిధిలోని కోర్టులలో ఈ నెల 14న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా న్యాయాధికారి శ్రీనివాస్, జిల్లా న్యాయసేవ అధికార సంస్థ కార్యదర్శి శివప్రసాద్ యాదవ్ గురువారం ఓ ప్రకటనలో కోరారు. పెండింగ్‌లో ఉన్న మోటారు వాహనాల ప్రమాద కేసులు, కుటుంబ తగాదాలు (విడాకుల కేసులు కాకుండా), పారిశ్రామిక వివాదాలు, ఇతర రాజీ చేయదగ్గ వివాదాలను రాజీ చేసుకోవచ్చని తెలిపారు.

బదిలీల గడువు పొడిగింపు

అనంతపురం టౌన్, సెప్టెంబరు 12: ఉద్యోగుల సాధారణ బదిలీల గడువును రాష్ట్ర ప్రభుత్వ పొడగించింది. తొలుత ఆగస్టు 15 నుంచి 31 వరకు బదిలీలకు అవకాశం కల్పించారు. తిరిగి సెప్టెంబరు 1వతేదీ నుంచి 15వతేదీలోగా పక్రియను పూర్తి చేయాలని సీఎస్ ఉత్తర్వులు ఇచ్చారు. రేపటిలోగా బదిలీలు మొత్తం కొలిక్కి వస్తాయని అందరూ ఉత్కంఠగా ఎదురుచూశారు. బదిలీలకు సంబంధించి మరోసారి గడువు పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. 15 శాఖలకు సంబంధించిన ఉద్యోగుల బదిలీలు ఈనెల 22వ తేదీలోగా పూర్తి చేయాలని ఆ శాఖలకు 23 నుంచి బదిలీలకు నిషేధం వర్తిస్తుందని సీఎస్ అధికారికంగా గురువారం ఉత్తర్వులను కలెక్టర్లకు పంపారు. ఒక్క ఎక్సైజ్ శాఖకు సంబంధించిన బదిలీలకు నెలాఖరు వరకు అవకాశం ఇచ్చారు. అక్టోబరు 1వ తేదీ నుంచి ఎక్సైజ్‌శాఖలో బదిలీలకు నిషేధం ఉంటుందని ఆ ఉత్తర్వుల్లో సీఎస్ పేర్కొన్నారు.

విశాలా ఫెర్రర్‌కు స్పెయిన్ వర్సిటీ డాక్టరేట్

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 12: ఆర్డీటీ మహిళా సాధికారత విభాగ డైరెక్టర్ విశాలా ఫెర్రర్‌కు స్పెయిన్‌లో గౌరవ డాక్టరేట్ దక్కింది. స్పెయిన్‌కు చెందిన బూర్గోస్ సిటీ యూనివర్సిటీ ఆఫ్ బర్గోస్‌లో గురువారం ఆమె డాక్టరేట్ అందుకున్నారు. మహిళల హక్కులు, సమానత్వంపై విశేషకృషి చేస్తున్న విశాలా ఫెర్రర్‌కు డాక్టరేట్ లభించింది.

పత్తిపాటి నారాయణమ్మకు ఎమ్మెల్యే సునీత నివాళి



నారాయణమ్మ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

అనంతపురం అర్బన్, సెప్టెంబరు 12: పల్నాడు జిల్లా చిలకలూరిపేట ఎమ్మెల్యే, మాజీ మంత్రి పత్తిపాటి పుల్లారావు తల్లి నారాయణమ్మ మృతి చెందడంతో ఎమ్మెల్యే పరిటాల సునీత ఆమెకు నివాళులు అర్పించారు. గురువారం పుల్లారావు నివాసంలో ఆయన తల్లి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు.

రేషన్ బియ్యం సక్రమంగా పంపిణీ చేయాలి



అర్బన్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

అనంతపురంరూరల్, సెప్టెంబరు 12: ప్రభుత్వం సరఫరా చేస్తున్న రేషన్ బియ్యాన్ని సక్రమంగా పంపిణీ చేయాలని సీపీఎం ఒకటవ నగర కమిటీ కార్యదర్శి రామిరెడ్డి డిమాండ్ చేశారు. గురువారం అనంతపురం అర్బన్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట పార్టీ ఆధ్వర్యంలో కార్డుదారులతో కలసి చేపట్టిన ధర్నాకు ఆయన హాజరై మాట్లాడారు. ప్రభుత్వం పంపిణీ చేస్తున్న రేషన్ బియ్యాన్ని కొందరు డీలర్లు, అధికారులతో కుమ్మక్కై అక్రమంగా రాష్ట్ర సరిహద్దులు దాటిస్తున్నారన్నారు. అర్బన్ పరిధిలో ఉన్న స్టోర్లలో ఇప్పటికే బియ్యం, సరుకులు 74 శాతం సరఫరా చేశామని అధికారులు లెక్కలు చూపిస్తున్నారన్నారు. కొన్ని స్టోర్లలో 25 శాతానికి మించి సరఫరా కాలేదన్నారు. బియ్యం చక్కెర అక్రమంగా అమ్ముకున్నారని మండిపడ్డారు. 58,326 మందికి రేషన్ కార్డులు ఉండగా ఇప్పటి దాకా 44,067 మందికి మాత్రమే బియ్యం సరఫరా చేశారన్నారు. నాయకులు వెంకటనారాయణ, ప్రకాష్, మసూద్, వలీ, రాజు, జీవా, సీన, వెంకటేష్, అంజి, డేవిడ్, రవి, బాషా, రామాంజనేయులు పాల్గొన్నారు.

మధ్యంతర భృతి ప్రకటించండి



గొందిరెడ్డిపల్లి పాఠశాలలో సభ్యత్వ నమోదు చేయిస్తున్న ఉపాధ్యాయులు

రాప్తాడు, సెప్టెంబరు 12: ఉపాధ్యాయులకు మధ్యంతర భృతి 30 శాతం వెంటనే ప్రకటించాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు రమణారెడ్డి, ప్రధాన కార్యదర్శి రమణారెడ్డి డిమాండ్ చేశారు. మండలంలోని పలు ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయుల సభ్యత్వ సేకరణ కార్యక్రమం చేపట్టారు. వారు మాట్లాడుతూ జీఓ 117ను రద్దు చేయాలన్నారు. 3, 4, 5 తరగతుల విలీనాన్ని నిలిపివేసి ప్రాథమిక పాఠశాలల్లోనే తరగతులు నిర్వహించాలన్నారు. ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిలర్ కృష్ణమోహన్, కార్యదర్శి మల్లికార్జున పాల్గొన్నారు.

బస్‌పాస్ కౌంటర్ ప్రారంభం



జ్యోతి వెలిగించి కౌంటర్‌ను ప్రారంభిస్తున్న మేనేజర్ కేఎస్ మూర్తి

అనంతపురం కల్చరల్, సెప్టెంబరు 12: ఏపీఎస్ఆర్టీసీ అనంతపురం బస్టాండులో నూతన బస్‌పాస్ కౌంటర్‌ను ప్రారంభించారు. ర్యాపిడో సంస్థ సహకారంతో బస్టాండులో ఏర్పాటు చేసిన నూతన కౌంటర్‌ను గురువారం బస్టాండు మేనేజర్ కేఎస్ మూర్తి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ బస్‌పాస్ కౌంటర్ డిపో కార్యాలయం ఆవరణలో ఉండడం వల్ల ప్రయాణికులకు బస్‌పాస్ కౌంటర్ ఎక్కడుందో అర్థమయ్యేది కాదని, ఈ నేపథ్యంలోనే ప్రయాణికుల సౌకర్యార్థం ర్యాపిడో సంస్థ సహకారంతో బస్టాండు ఆవరణలోనే కౌంటర్‌ను ఏర్పాటు చేశామన్నారు. ఇకనుంచి నూతన కౌంటర్‌లో బస్‌పాసులు అందిస్తామన్నారు. ర్యాపిడో జోనల్ మేనేజర్ చంద్రశేఖర్, శంకర్ పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ విత్తనాలను వినియోగించుకోండి



రైతులకు విత్తనాలు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

రాప్తాడు, సెప్టెంబరు 12: ప్రభుత్వం సబ్సిడీతో పంపిణీ చేసే ప్రత్యామ్నాయ విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని టీడీపీ నాయకులు కోరారు. రాప్తాడులోని రైతు భరోసా కేంద్రంలో గురువారం రైతులకు సబ్సిడీతో ఉలవలు పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో కన్వీనర్ కొండప్ప, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, రాప్తాడు సర్పంచ్ సాకే తిరుపాలు, పంచాయతీ కార్యదర్శి అరుణ్‌కుమార్, టీడీపీ శ్రేణులు పాల్గొన్నారు. అలాగే గొందిరెడ్డిపల్లి గ్రామంలో సర్పంచ్ శీనయ్య, ఎంపీటీసీ జాఫర్ రైతులకు ప్రత్యామ్నాయ విత్తనాలు పంపిణీ చేశారు.

విద్యాశాఖ సిబ్బందిపై దాడి హేయం

అనంతపురం విద్య, సెప్టెంబరు 12: కడపలో జిల్లా విద్యాశాఖ సిబ్బందిపై కొందరు ఉపాధ్యాయ సంఘం నాయకులు దాడి చేయడం హేయమైన చర్య అని జిల్లా విద్యాశాఖ అధికారులు, సిబ్బంది ఖండించారు. గురువారం డీఈఓ ఆఫీస్ వద్ద నిరసన తెలిపారు. ఏడీలు, సూపరింటెండెంట్లు మాట్లాడుతూ.. 5వ తేదీ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా అవార్డుల విషయంలో సీనియర్ అసిస్టెంట్‌పై ఎస్టీఎఫ్ ఉపాధ్యాయ సంఘం నాయకులు దాడి చేశారని తెలిపారు. ఉద్యోగులపై దాడి చేయడం సబబుకాదన్నారు. మంచి ఉపాధ్యాయులకు, 15 ఏళ్ల నుంచి 20 ఏళ్ల సర్వీసు ఉన్న టీచర్లను కమిటీ సిఫార్సుల మేరకు అవార్డులకు ఎంపిక చేస్తారన్నారు. సంఘాల నాయకులు చెప్పిన వాళ్లకే అవార్డులు ఇవ్వాలన్న ధోరణితో దాడి చేయడం దుర్మార్గం అంటూ అసహనం వ్యక్తం చేశారు. ఏడీ క్రిష్ణయ్య, సూపరింటెండెంట్లు ఆదినారాయణ, లక్ష్మీనారాయణ, సీనియర్ అసిస్టెంట్లు పార్థసారథి, జిలాన్ పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న విద్యాశాఖ అధికారులు, సిబ్బంది

అభివృద్ధిని అటకెక్కించిన వైసీపీ

● ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్



రోడ్డు నిర్మాణ పనులకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే

అనంతపురంరూరల్, సెప్టెంబరు 12: వైసీపీ పాలనలో అభివృద్ధిని అటకెక్కించిందని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ విమర్శించారు. గురువారం మండలంలోని ఎ.నారాయాణపురం పంచాయతీ తపోవనంలో సీసీరోడ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే హాజరై స్థానిక నాయకులు, అధికారులతో కలసి భూమిపూజ చేశారు. ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చి వందరోజులు కూడా గడవకుండానే నియోజకవర్గంలోని పంచాయతీల్లో అభివృద్ధిపనులకు శ్రీకారం చుట్టామన్నారు. ఎన్ఆర్‌జీఎస్ కింద రూ.3కోట్లతో సీసీరోడ్ల నిర్మాణం చేపడుతున్నామన్నారు. నారాయణపురం పంచాయతీలో రూ.55లక్షల పనులకు భూమి పూజ చేశామన్నారు. పనులు నెలరోజుల్లో పూర్తిచేసి కొత్తవాటికి ప్రతిపాదనలు చేస్తామన్నారు. ఎంపీడీఓ పుల్లయ్య, పంచాయతీ స్పెషల్ ఆఫీసర్ సురేష్, కార్యదర్శి అశోక్‌బాబు, టీడీపీ నాయకులు రాగే మురళీమోహన్, డిష్ నాగరాజు, మాజీ సర్పంచు రామలక్ష్మి, ఓబులపతి, నాగరాజు, రఘునాథ్‌రాయల్, మురళీ, రజినీ, అక్షిత, అమరనాథ్, రంగనాయకులు పాల్గొన్నారు.

తిరుమలకు పాదయాత్ర



తిరుమలకు పాదయాత్రగా బయలుదేరుతున్న బృందం సభ్యులు

చెన్నేకొత్తపల్లి, సెప్టెంబరు 12: మండల కేంద్రం నుంచి తిరుమలకు 15 మంది గురువారం పాదయాత్రగా బయలుదేరి వెళ్లారు. వర్షాలు బాగా కురిసి, సమృద్ధిగా పంటలు పండి రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని కోరుకుంటూ పాదయాత్రగా వెళ్తున్నట్లు బృందం సభ్యులు తెలిపారు. బృందంలో శ్రీనివాసరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, పవన్‌కల్యాణ్‌రెడ్డి, ప్రేమ్‌కుమార్‌రెడ్డి ఉన్నారు.

చంద్రబాబు పేరు పలికే అర్హత జగన్‌కు లేదు

● టీడీపీ కుమ్మర శాలివాహన కన్వీనర్ పోతులయ్య

అనంతపురం అర్బన్, సెప్టెంబరు 12: సీఎం చంద్రబాబునాయుడు పేరు ఉచ్చరించే అర్హత కూడా జగన్‌కు లేదని టీడీపీ కుమ్మర శాలివాహన రాష్ట్ర కన్వీనర్ పోతులయ్య అన్నారు. ఈ మేరకు గురువారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. వరద బాధితులను ఆదుకునేందుకు సీఎం రాత్రింబవళ్లు కష్టపడుతున్నారన్నారు. ప్రజా శ్రేయస్సే ధ్యేయంగా పనిచేస్తున్న ఆయనపై అవగాహన రాహిత్యంతో వైసీపీ అధినేత జగన్ ఇష్టారాజ్యంగా మాట్లాడటం సిగ్గుచేటన్నారు. జగన్ వైఖరి నచ్చకే జనం ప్రతిపక్ష హోదా కూడా ఇవ్వకుండా ఘోరంగా ఓడించారన్నారు. ఇప్పటికైనా జగన్ తన సైకో బుద్ధిని మానుకోవాలన్నారు.

కొనసాగిన దుప్పట్ల పంపిణీ

అనంతపురం అర్బన్, సెప్టెంబరు 12: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి వైకుంఠం ప్రభాకర్ చౌదరి ఆధ్వర్యంలో వరద బాధితులకు దుప్పట్లు పంపిణీ కొనసాగింది. గురువారం రెండో రోజు విజయవాడ వెస్ట్ నియోజకవర్గంలోని 42వ డివిజన్‌లో వరద బాధితులకు టీడీపీ నాయకులు దుప్పట్లు పంపిణీ చేశారు. దేవళ్ల మురళీ, గోపాల్ గౌడ్, రామాంజనేయులు, వడ్డే మురళీ పాల్గొన్నారు.

రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తే చర్యలు

రామగిరి, సెప్టెంబరు 12: మండలంలో అసత్యప్రచారాలతో ప్రజలను రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేస్తే చట్టపరంగా కఠినచర్యలు తీసుకుంటామని ఎస్ఐ సుధాకర్‌యాదవ్ హెచ్చరించారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పోలీసులు ప్రజలపట్ల నిష్పక్షపాతంగా వ్యవహరిస్తారన్నారు. నసనకోట గ్రామంలో రాళ్ల విసరకపోయినా విసిరినట్లు సృష్టించి స్వలాభం కోసం అమాయకులైన ప్రజలను రెచ్చగొట్టేలా చేయడం మంచిది కాదన్నారు. సుద్దకుంటపల్లిలో తుపాకీ గురించి రాజకీయాలకు ముడిపెట్టడం సరికాదని, ఇది పూర్తిగా అసత్యమన్నారు.

జపాన్ వర్సిటీతో పీవీకేకే అవగాహన ఒప్పందం



ఒప్పంద పత్రాలు అందుకుంటున్న చైర్మన్ పల్లె కిశోర్

అనంతపురంరూరల్, సెప్టెంబరు 12: జపాన్‌లోని ఐజు ఆఫ్ యూనివర్సిటీతో పీవీకేకే ఐటీ అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఆ మేరకు గురువారం కళాశాలలో యూనివర్సిటీ సమాచార వ్యవస్థల విభాగం ఐ ట్రాన్స్‌ఫర్మేషన్ క్లస్టర్ లీడర్ రాగే ఉదయ్‌కిరణ్ విద్యాసంస్థల చైర్మన్ పల్లె కిశోర్, కళాశాల మేనేజ్‌మెంట్, పరిపాలన అధికారులు, సీనియర్ ఫ్యాకల్టీతో సమావేశమయ్యారు. అవగాహన ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. చైర్మన్ పల్లె కిశోర్ మాట్లాడుతూ ఈ ఒప్పందంతో కళాశాల విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ అవకాశాలు దక్కుతాయన్నారు. కళాశాల కోశాధికారి పల్లె సింధూర, యాజమాన్య ప్రతినిధి శ్రీకాంత్‌రెడ్డి, ప్రిన్సిపాల్ రమేష్‌బాబు, అకడమిక్ డీన్ సంతోష్‌రెడ్డి, కళాశాల విభాగాధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

వైద్య సిబ్బంది ఇంటింటి సర్వే

చెన్నేకొత్తపల్లి, సెప్టెంబరు 12: మండలంలోని ముష్టికోవెల గ్రామంలో గురువారం కూడా వైద్యసిబ్బంది ఇంటింటి సర్వే చేపట్టారు. గ్రామంలో గణేశ్ నిమజ్జనం సందర్భంగా పంపిణీచేసిన ప్రసాదాన్ని తిని 60 మంది అస్వస్థతకు గురికాగా అక్కడ మూడు రోజులుగా వైద్యసిబ్బంది ప్రత్యేక శిబిరాన్ని నిర్వహిస్తూ ఇంటింటి సర్వే కూడా చేపట్టారు. డాక్టర్ ప్రశాంత్ ఆధ్వర్యంలో గ్రామంలో ప్రతి ఇల్లు తిరిగి సర్వేచేపట్టడంతోపాటు ప్రజలకు అవగాహన కల్పించారు. ఎంఎల్‌హెచ్‌పీ భార్గవి, హెల్త్‌అసిస్టెంట్ వెంకటేష్, ఏఎన్ఎం కుమారి, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రి వద్ద అన్నదానం

అనంతపురం కల్చరల్, సెప్టెంబరు 12: నిత్యసురభి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ప్రభుత్వ సర్వజనాస్పత్రి వద్ద అన్నదానం నిర్వహించారు. ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మాసవారీ కార్యక్రమాల్లో భాగంగా గురువారం ప్రభుత్వ సర్వజనాస్పత్రి వద్ద ట్రస్టు చైర్‌పర్సన్ నిర్మలామురళి చేతులమీదుగా 250 మందికి అన్నదానం చేశారు. ట్రస్టు సభ్యులు పురుషోత్తం, కవీన్ ఆదిత్య, శ్రీనివాసులు, శ్రీలక్ష్మి, సుబ్రహ్మణ్యం, ఓబులపతి, కిష్టప్ప, నల్లప్ప పాల్గొన్నారు.

ఉచిత గుండె వైద్యశిబిరం



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

రామగిరి, సెప్టెంబరు 12: మండలంలోని పేరూరు ఉన్నతపాఠశాలలో మార్పు సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ఆధ్వర్యంలో గురువారం ఉచిత గుండె వైద్యశిబిరాన్ని నిర్వహించారు. 340 మంది వైద్యపరీక్షలు చేయించుకున్నారు. గుండె సంబంధిత వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారిని మెరుగైన వైద్యం కోసం అనంతపురం ఆస్పత్రికి రెఫర్ చేశారు. గ్రామీణ ప్రాంతాలలో ఇలాంటి వైద్యశిబిరాలు నిర్వహించడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తంచేశారు.డాక్టర్ రామ్మోహన్‌చౌదరి మాట్లాడుతూ ఎమ్మెల్యే పరిటాల సునీత, పరిటాలశ్రీరామ్, పరిటాల సిద్ధార్థ సూచనల మేరకు వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారని ఆయన తెలిపారు. టీడీపీ నాయకులు రామ్మూర్తినాయుడు, పరంధామ యాదవ్, సుధాకర్, శ్రీధర్‌నాయుడు, శ్రీనివాసులు, వడ్డి సుబ్బు, కేశవ పాల్గొన్నారు.

ప్రజలు విశ్వాసంతో ముందుకు సాగాలి



పాస్టర్ కుమారుడి వైద్యానికి చెక్కును అందచేస్తున్న అతిథులు

అనంతపురంరూరల్, సెప్టెంబరు 12: ప్రజలు విశ్వాసంతో ముందుకు సాగాలని రాజమండ్రి బైబిల్ మిషన్ కార్యదర్శి ప్రశాంత్‌కుమార్ అన్నారు. గురువారం జిల్లా పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బైబిల్ మిషన్ చర్చ్ ఏడో వార్షికోత్సవాన్ని లలితకళాపరిషత్‌లో నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షుడు నాగరాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్య ప్రసంగీకులుగా రెవరెండ్ ప్రశాంత్ కుమార్ హాజరయ్యారు. అనంతరం 21మంది పాస్టర్స్‌కు రూ.1000 చొప్పున ఆర్థికసాయం చేశారు. టీడీపీ నాయకులు శమంతకమణి, అశోక్‌బాబు, ఏడీపీడబ్ల్యూఏ గౌరవాధ్యక్షుడు రాజు, బైబిల్ మిషన్ ప్రతినిధులు జాన్సన్, గవర్నింగ్ బాడీ సభ్యులు శామ్యూల్ కిరణ్, పాస్టర్ జాన్‌రాజేష్ పాల్గొన్నారు.

నైపుణ్యాలను మెరుగుపరచుకోవాలి

అనంతపురం సెంట్రల్, సెప్టెంబరు 12: పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా ఐటీఐ విద్యార్థులు నైపుణ్యాలను మెరుగుపరచుకోవాలని పరిశ్రామికవేత్తలు జిలానీ, సుధీర్ సూచించారు. గురువారం ప్రభుత్వ బాలుర ఐటీఐ కళాశాలలో పూర్వవిద్యార్థుల సమ్మేళనం, ఫ్రెషర్స్‌డే నిర్వహించారు. ప్రిన్సిపాల్ రామూర్తి అధ్యక్షతన నిర్వహించిన వేడుకల్లో పూర్వ విద్యార్థులు ఉద్యోగ అవకాశాలపై విద్యార్థులకు వివరించారు.

కౌంటర్ కేసులను ఎత్తివేయాలి

అనంతపురం సెంట్రల్, సెప్టెంబరు 12: అట్రాసిటీ కేసుల్లో బాధితులపై గత వైసీపీ ప్రభుత్వంలో పెట్టిన కౌంటర్ కేసులను ఎత్తివేసి న్యాయం చేయాలని ఎమ్మార్పీఎస్ రాయలసీమ జిల్లాల అధికార ప్రతినిధి అక్కులప్ప కోరారు. ఈ మేరకు గురువారం జిల్లా ఎస్పీ జగదీష్‌ను కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. రాజు, వన్నూరుస్వామి, సురేష్‌బాబు పాల్గొన్నారు.

వరద బాధితుల నిధికి విరాళం

శింగనమల సెప్టెంబరు 12: వరద బాధితులకు చిన్న జలాలపురం టీడీపీ నాయకులు విరాళం అందజేశారు. గురువారం చిన్న జలాలపురం గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు పట్నం నగేష్, సుధాకర్, కాయల రమణ వరద బాధితులకు విరాళం రూ.10 వేలును ఎమ్మెల్యే ఆమ్మ బండారు లీలావతికి అందజేశారు.

రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయుడి మృతి



మల్లికార్జున(ఫైల్)

ధర్మవరంరూరల్(కనగానపల్లి), సెప్టెంబరు12: కనగానపల్లి మండలం భానుకోట సమీపంలో గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ ఉపాధ్యాయుడు మృతిచెందాడు. స్థానికులు, కుటుంబసభ్యులు తెలిపిన మేరకు రామగిరి మండలం పిచ్చిరెడ్డికొట్టాల ప్రాథమిక పాఠశాలలో ఎం.మల్లికార్జున(35) అనే ఉపాధ్యాయుడు విధులు ముగించుకుని స్వగ్రామమైన ఆత్మకూరు మండలం సనప గ్రామానికి ద్విచక్రవాహనంలో భానుకోట సమీపంలో వెళుతుండగా అడవిపందులు అడ్డురావడంతో వాటిని ఢీకొన్నాడు. ప్రమాదంలో ఉపాధ్యాయుడు కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. అటుగా వెళుతున్న వాహనదారులు అతనిని గమనించి అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. మల్లికార్జున మృతిచెందిన విషయం తెలుసుకున్న రామగిరి ఎంఈఓ-2 శ్రీనివాసులు, ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కోణంకి అశోక్‌కుమార్, హరిప్రసాద్, రవికుమార్, ప్రధానోపాధ్యాయులు మల్లికార్జున, ఆసుపత్రికి వెళ్లి కుటుంబసభ్యులను పరామర్శించారు.

కాస్త ఈ వంక చూడండి సార్..!



నీటిలో ద్విచక్రవాహనాన్ని తోస్తున్న వ్యక్తి

రాప్తాడు, సెప్టెంబరు 12: రాప్తాడు నుంచి చిన్మయానగర్‌కు వెళ్లాలంటే పండమేరు వంక దాటాలి. ఈ వంకలో కృష్ణా జలాలు ప్రవహిస్తున్నాయి. దీంతో రాప్తాడు నుంచి చిన్మయానగర్‌కు ప్రయాణం ప్రమాదకరంగా మారింది. పండమేరు వంకలో నీరు ప్రవహిస్తుండటంతో చిన్మయానగర్‌కు వెళ్లే దారిలో పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. దీంతో ఆ దారి గుండా వాహనాల రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. ద్విచక్రవాహనాలు వెళ్లేటప్పుడు టైర్లు పూర్తిగా నీళ్లలో మునిగిపోతున్నాయి. దారిలో కింద వైపు రాళ్లు ఉండటంతో నీళ్లు ప్రవహించేటప్పుడు రాళ్లు కనపడక వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. దారి పక్కనే పెద్ద పెద్ద గుంతల్లో నీరు ప్రవహిస్తున్నాయి. అధికారులు స్పందించి వాహనాలు సురక్షితంగా వెళ్లేలా చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

ఘనంగా వినాయక నిమజ్జనం



పేరూరులో నిమజ్జనానికి తరలుతున్న వినాయకుడు

రామగిరి, సెప్టెంబరు 12: మండలంలోని పేరూరు గ్రామంలో గురువారం వినాయక నిమజ్జనానికి ఘనంగా నిర్వహించారు. వినాయక ఉత్సవ విగ్రహాన్ని ఐదు రోజులుగా పూజలు నిర్వహించి గురువారం సాయంత్రం ఆనందోత్సాహాల మధ్య నిజ్జన కార్యక్రమం నిర్వహించారు. ఊరేగింపులో మహిళలు, చిన్నారులు రంగులు చల్లుకుంటూ తరలివెళ్లారు.

వెంకటేశ్వర వైభవానికి ఆహ్వానం



కలెక్టర్‌కు ఆహ్వానపత్రిక అందజేస్తున్న విజయసాయికుమార్

అనంతపురం కల్చరల్, సెప్టెంబరు 12: సాయి ట్రస్టు ఆధ్వర్యంలో 14వ తేదీన గుత్తిరోడ్డులోని శ్రీ-7 కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించనున్న వెంకటేశ్వర వైభవం కార్యక్రమంలో పాల్గొనేందుకు జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులను ట్రస్టు నిర్వాహకులు ఆహ్వానించారు. ట్రస్టు అధ్యక్షుడు విజయ సాయికుమార్ గురువారం అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్, కలెక్టర్ వినోద్‌కుమార్‌లను వారి కార్యాలయాల్లో కలిసి ఆహ్వాన పత్రికలు అందజేశారు. జిల్లా ప్రజలు ఈ కార్యక్రమంలో విరివిగా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ట్రస్టు సభ్యులు నారాయణ, రాఘవ పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో నిందితుడు

● హత్యకు దారితీసిన బీరుబాటిల్ గొడవ

అనంతపురం క్రైం,సెప్టెంబరు 12: నగరంలో బుధవారం రాత్రి జరిగిన హత్య కేసులో నిందితుడు పండ్ల తేజను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బీరు పగలకొట్టినందుకు జరిగిన గొడవే హత్యకు దారి తీసిందని వన్‌టౌన్ సీఐ రాజేంద్రనాథ్‌యాదవ్ తెలిపారు. భవనానీనగర్‌కు చెందిన దేవరకొండ శ్రీధర్, నవోదయకాలనీకి చెందిన పండ్లతేజ సమీప బంధువులు. బుధవారం మధ్యాహ్నం సమయంలో ఇద్దరూ మరో ఇద్దరితో కలిసి బీరు, మద్యం తాగారు. ఈ సందర్భంలో శ్రీధర్ చేయి తగిలి బీరు బాటిల్ పగిలిపోయింది. దీంతో తేజ మరో బీరు తేవాలని కోరాడు. ఈ టైంలో ఎక్కడ దొరుకుతుంది మళ్లీ తెప్పిస్తాలేనని చెప్పడంతో ఆ వివాదం అక్కడితో సద్దుమణిగింది. రాత్రి సమయంలో నిమజ్జనం జరుగుతుండగా ఆ నలుగురు మరోసారి తాగడానికెళ్లారు. ఆ సమయంలో వారి వద్ద ఉన్న యువకుడు బీరు పగిలిన విషయం లేవనెత్తాడు. ఆ సమయంలో శ్రీధర్, తేజ మధ్య వాగ్వాదం జరిగింది. ఈ క్రమంలో తేజ కోపంతో తన వద్దనున్న కత్తితో శ్రీధర్ మెడపై ఒక వేటు వేశాడు. తీవ్ర రక్తగాయంతో కొన్ని అడుగులు ముందుకు నడిచి సచివాలయం ఎదుట పడిపోయాడు. ఘటనపై ఆరా తీసిన పోలీసులు తేజను అదుపులోకి తీసుకుని విచారించారు. రెండు నెలల క్రితం పవర్ ఆఫీస్ సమీపంలో తేజ బైక్‌పై వెళ్తుండగా మరో బైక్ ఢీ కొట్టింది. ఆ సమయంలో అవతలి వారు డబ్బులివ్వాలని కోరగా... 'ఇవ్వను, ఏం చేసుకుంటారో చేసుకో'మని చెప్పాడు. దీంతో వారు తేజ ఫొటో తీసుకుని ఎప్పుడో ఒకసారి దొరికినపుడు నీ సంగతి చెబుతామని బెదిరించారని తెలిసింది. అప్పటి నుంచి కత్తి పెట్టుకుని తిరుగుతున్నట్లు పోలీసుల విచారణలో చెప్పుకొచ్చినట్లు సమాచారం. శుక్రవారం నిందితుడిని రిమాండ్‌కు తరలిస్తామని సీఐ తెలిపారు.

యువకుడి ఆత్మహత్య

ఉద్యోగం రాలేదని మనస్థాపానికి గురైన ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. అనంతపురం రూరల్ మండలం ఎన్ఆర్ కాలనీకి చెందిన ఎరికల సునీల్ (22) ఎంబీఏ పూర్తి చేశాడు. కొంతకాలంగా ఉద్యోగం కోసం ప్రయత్నించాడు. ఉద్యోగం రాకపోవడంతో బాధపడుతూ ఉండేవాడు. ఈ క్రమంలో బుధవారం అర్ధరాత్రి తన ఇంట్లోనే ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అనంతపురం రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

గార్లదిన్నె, సెప్టెంబరు 12: మండలంలోని కోటంక గ్రామానికి చెందిన శోభ (22) అనే మహిళ చికిత్స పొందుతూ గురువారం తెల్లవారుజామున మృతి చెందింది. పోలీసులు తెలిపిన మేరకు యర్రగుంట్ల గ్రామానికి చెందిన ఎర్రిస్వామి కుమార్తెను 6 సంవత్సరాలు క్రితం కోటంక గ్రామానికి చెందిన చిదానందకు ఇచ్చి వివాహం చేశారు. భార్యాభర్తలిద్దరు గార్లదిన్నెలో నివాసం ఉంటూ కిరాణాషాపులో పనిచేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. వీరికి సంతానం కలగలేదు. భర్త చిదానంద, అత్త నాగలక్ష్మిలు శోభను వేధిస్తుండేవారు. భర్త, అత్త వేధింపులు తాళలేక శోభ బుధవారం సూపర్‌వాస్మోల్ తాగి ఆత్మహత్యకు యత్నించింది. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం తెల్లవారుజామున మృతి చెందింది. తండ్రి ఎర్రిస్వామి ఫిర్యాదు మేరకు భర్త చిదానంద, అత్త నాగలక్ష్మి, మరిది దినేష్‌పై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

పగలే చోరీ

ధర్మవరం రూరల్(కనగానపల్లి), సెప్టెంబరు 12: మండలంలోని దాదులూరు శివారులో మిద్దెల వద్ద పట్టపగలే రెండు ఇళ్లల్లో గురువారం చోరీ జరిగింది. స్థానికులు తెలిపిన మేరకు దాదులూరు మిద్దెలలో నివాసం ఉండే బత్తల శ్రీనివాసులు, రమేష్ అనే అన్నదమ్ములు పక్కపక్కనే నివాసం ఉంటున్నారు. వ్యవసాయ పనుల నిమిత్తం వారి కుటుంబసభ్యులు తోటలోకి వెళ్లారు. పనులు ముగించుకుని ఇంటికి రాగా ఇంటి తలుపులు ధ్వంసం చేయడమే కాక ఇంట్లో బీరువా తాళాలు పగలగొట్టడాన్ని గమనించారు. వారి ఇళ్లలో రూ.65 వేలు నగదుతో పాటు 10 తులాల బంగారు ఎత్తుకెళ్లినట్లు బాధితులు వాపోయారు. చోరీ విషయంపై తమకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని కనగానపల్లి పోలీసులు తెలిపారు.

అత్యాచార నిందితుడి అరెస్టు

బుక్కరాయసముద్రం, సెప్టెంబరు 12: మండలంలోని కేకే ఆగ్రహారం గ్రామ పంచాయతీలోని ఓ గ్రామంలో బాలికపై అత్యాచారం చేసిన కేసులో నిందితుడు సాకే నాగరాజును గురువారం రాత్రి అరెస్టు చేసినట్లు అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటశివారెడ్డి తెలిపారు. ఇందుకు సంబంధించి ఆయన తెలిపిన మేరకు.. బాలికకు మాయ మాటలు చెప్పి, పలుసార్లు అత్యాచారం చేసి గర్భవతిని చేసినట్లు విచారణలో తేలిందన్నారు. సంఘటనపై బుక్కరాయసముద్రం పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ తెలిపారు.

రేపు హ్యాండ్‌బాల్ జిల్లా జట్ల ఎంపిక పోటీలు

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 12: జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం ఆర్ట్స్ కళాశాల మైదానంలో జిల్లా హ్యాండ్‌బాల్ సబ్ జూనియర్స్ బాల, బాలికల జట్ల ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రమణారెడ్డి, రఫీయుద్దీన్ తెలిపారు. 2010 తరువాత జన్మించిన బాల, బాలికల క్రీడాకారులు అర్హులన్నారు. ఆసక్తి, అర్హత గల క్రీడాకారులు జనన ధృవీకరణ పత్రం, ఆధార్‌కార్డు, క్రీడాసామగ్రి, యూనిఫాంతో హాజరుకావాలన్నారు. ఎంపికైన జట్లు 20వతేదీ నుంచి కడప జిల్లా వేంపల్లెలో నిర్వహించే 38వ రాష్ట్రస్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు ప్రాతినిథ్యం వహిస్తాయన్నారు. మరిన్ని వివరాలకు 9949942494, 8639138569 నంబర్లను సంప్రదించాలని కోరారు.

17మందిపై కేసు నమోదు

యాడికి, సెప్టెంబరు 12: మండలంలోని వెంగన్నపల్లిలో బుధవారం జరిగిన గొడవకు సంబంధించి ఇరువర్గీయుల ఫిర్యాదు మేరకు 17మందిపై కేసు నమోదు చేసినట్లు సీఐ ఈరన్న తెలిపారు. వెంగన్నపల్లిలో పాతకక్షల నేపథ్యంలో వైసీపీ నాయకుడు భాస్కర్‌రెడ్డి ఇంటిపై టీడీపీ వర్గీయులు దాడిచేసి భాస్కర్‌రెడ్డి కారు అద్దాలు పగలగొట్టారని తెలిపారు. భాస్కర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు టీడీపీ వర్గీయులు 8మందిపై కేసు నమోదుచేసినట్లు తెలిపారు. లక్ష్మీరంగారెడ్డి, త్రినాథ్‌రెడ్డి, రంగస్వామిరెడ్డి, సూర్యనారాయణరెడ్డి, శ్రీరాములు, వెంకటరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, వెంకటనారాయణరెడ్డిలపై కేసు నమోదుచేసినట్లు తెలిపారు. టీడీపీ నాయకుడు లక్ష్మీరంగారెడ్డిపై వైసీపీ వర్గీయులు దాడియత్నం చేశారని లక్ష్మీరంగారెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు వైసీపీ వర్గీయులు 9మందిపై కేసు నమోదుచేసినట్లు తెలిపారు. భాస్కర్‌రెడ్డి, పంపిరెడ్డి, నిరంజన్‌రెడ్డి, పి. రాజారెడ్డి, రామేశ్వరరెడ్డి, నల్లపురెడ్డి, లక్ష్మీనాథ్‌రెడ్డి, నాగభూషణరెడ్డి, ఎస్. రాజారెడ్డిలపై కేసు నమోదుచేసినట్లు సీఐ తెలిపారు.

దాడికేసులో నిందితుల అరెస్టు

యల్లనూరు, సెప్టెంబరు 12: మండలకేంద్రంలో బుధవారం ఉదయం టీడీపీ కార్యకర్తలపై జరిగిన దాడి కేసులో నిందితులను గురువారం అరెస్టు చేసినట్లు సీఐ సుబ్రహ్మణ్యం తెలిపారు. ఈ కేసులో శ్రీనివాసులుతోపాటు మరో ఏడుగురిని తిరుమలాపురం క్రాస్ వద్ద అదుపులోకి తీసుకున్నామన్నారు. అనంతరం కోర్టులో హాజరుపరిచినట్లు సీఐ తెలిపారు.

సీతారాం ఏచూరి మృతి బాధాకరం

యాడికి, సెప్టెంబరు 12: సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మృతి కమ్యూనిస్టు వాదులకు తీరనిలోటని ఆ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి జూటూరు రఫీ గురువారం ప్రకటనలో తెలిపారు. కమ్యూనిస్టు విప్లవ యోధుడు సీతారాం ఏచూరి మృతి బాధాకరమన్నారు. చట్టసభల్లో పేదల గళాన్ని వినిపిస్తూ అట్టడుగు వర్గాల అభ్యున్నతి కోసం పనిచేసిన దార్శనికుడు సీతారాం అని ఆయన కొనియాడారు.

చేతివృత్తుల వారిని గుర్తించండి

యల్లనూరు, సెప్టెంబరు 12: మండలంలో చేతివృత్తి పనులు చేసే వారిని గుర్తించాలని ఈఓఆర్డీ విజయశేఖర్‌నాయుడు పంచాయతీ సెక్రెటరీలను ఆదేశించారు. మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం సాయంత్రం ఆయన సెక్రెటరీలతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. గ్రామాల్లో విశ్వకర్మలు, కుట్టుపని చేసేవారు, తాపీమేస్త్రీ పనివారిని గుర్తించి వారి వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు.

17 నుంచి స్వచ్ఛతాహి సేవ

బొమ్మనహాళ్, సెప్టెంబరు 12 : మండలంలోని ఈ నెల 17వ తేదీ నుంచి స్వచ్ఛతాహి సేవా కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ షకీలాబేగం, ఈఓపీఆర్డీ దాస్ తెలిపారు. మండలకేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో గురువారం వారు పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఈనెల 17వ తేదీ నుంచి స్వచ్ఛతాహి సేవా కార్యక్రమాన్ని ర్యాలీగా నిర్వహించి ప్రారంభించనున్నట్లు చెప్పారు. కార్యక్రమం ఉద్దేశం గ్రామాలను పరిశుభ్రంగా ఉంచడమేనన్నారు. దీనిపై ప్రజలకు వివరించాలన్నారు.

17న ప్రజావేదిక

బెళుగుప్ప, సెప్టెంబరు 12: మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం వద్ద ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ ప్రజావేదికను ఈ నెల17వ తేదీ నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రామచంద్ర గురువారం ప్రకటనలో తెలిపారు. ఈ పథకం నిధులతో 2023 ఏప్రిల్ 4 నుంచి 2024 మార్చి 31 వరకు చేపట్టిన పనులపై తనిఖీ బృందాలు తనిఖీలు చేపట్టాయని, ఆ వివరాలను వెల్లడించేందుకు గాను ప్రజావేదికను నిర్వహించనున్నామని చెప్పారు. ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరుకావాలని కోరారు.


గ్రామసభల్లో పాల్గొననున్న ఎమ్మెల్యే

తాడిపత్రి, సెప్టెంబరు 12: మండలంలోని బోడాయిపల్లి, వెలమకూరు, ఆలూరు గ్రామాల్లో శుక్రవారం జరగనున్న గ్రామసభల్లో ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి పాల్గొననున్నట్లు టీడీపీ మండల కన్వీనర్ కూరపాటి నరేంద్రనాయుడు గురువారం ప్రకటనలో తెలిపారు. గ్రామసభల్లో అన్నిశాఖల అధికారులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొంటారని ఆయన చెప్పారు.

అంజుమన్ వీధిలో అన్నదానం

గుంతకల్లుటౌన్, సెప్టెంబరు 12: మిలాదున్నబీ పండుగను పురస్కరించుకుని పట్టణంలోని అంజుమన్ వీధిలో గురువారం అంజుమన్ ఏ ఇస్లామియా కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం జరిగింది. కార్యక్రమానికి ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం సోదరుడు గుమ్మనూరు నారాయణస్వామి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ శ్రీనాథ్‌గౌడ్, టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర అధికారి ప్రతినిధి పవన్‌కుమార్‌గౌడ్, పార్టీ పట్టణ అధ్యక్షుడు బండారు ఆనంద్, లీగల్ సెల్ రాష్ట్ర కార్యదర్శి బీఎస్ కృష్ణారెడ్డి, వాల్మీకి సాధికారిక కమిటీ జిల్లా ప్రధాన కార్యదర్శి తలారి మస్తానప్ప, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ గుమ్మనూరు వెంకటేష్ ముఖ్యఅతిథులుగా హాజరై భోజనం వడ్డించారు. అంజుమన్ కమిటీ అధ్యక్షుడు సయ్యద్ జాఫర్, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ లైన్‌మన్ ఆత్మహత్య


రామాంజనేయులు (ఫైల్)

కళ్యాణదుర్గం రూరల్, సెప్టెంబరు 12: పట్టణంలో విద్యుత్ లైన్‌మెన్ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని మారంపల్లి కాలనీకి చెందిన రామాంజనేయులు (56) విద్యుత్ శాఖలో లైన్‌మెన్‌గా కంబదూరు మండలం తిమ్మాపురంలో పని చేస్తున్నారు. అయితే ఆయన కొద్దికాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. విధి నిర్వహణకు తన ఆరోగ్యం సహకరించడం లేదని మానసికంగా కృంగిపోయేవాడన్నారు. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెంది బుధవారం రాత్రి ఇంటిలోని తన గదిలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గురువారం ఉదయం కుటుంబసభ్యులు చూడగా ఫ్యాన్‌కు విగతజీవిగా వేలాడుతూ కనిపించాడు. ఘటనాస్థలాన్ని పట్టణ పోలీసులు పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమి త్తం స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య తిప్పమ్మ, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి


మృతి చెందిన గుర్తుతెలియని వ్యక్తి

తాడిపత్రి, సెప్టెంబరు 12: పట్టణంలోని ఎన్టీఆర్ సర్కిల్‌లో ఉన్న డివైడర్‌పై గురువారం గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడని పట్టణ సీఐ సాయిప్రసాద్ తెలిపారు. మృతుడు భిక్షాటన చేసుకుంటూ జీవించేవాడన్నారు. అతడి వివరాలు తెలిసిన వారు పట్టణ పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని సీఐ కోరారు.


విజయవాడలో వరద బాధితులకు నిత్యావసరాలను అందిస్తున్న ఎమ్మెల్యే అమిలినేని


తాడిపత్రిలో ఎమ్మెల్యే అశ్మిత్‌రెడ్డికి చెక్కును అందజేస్తున్న స్వయం సహాయక సంఘాల సభ్యులు



గుంతకల్లులో విరాళాల సేకరణలో శంకరానందగిరి స్వామి డిగ్రీ కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు

వరద బాధితులకు చేయూత

● విజయవాడలో నిత్యావసర సరుకుల్ని పంపిణీ చేసిన ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు

కళ్యాణదుర్గం, సెప్టెంబరు 12: విజయవాడలోని వరద బాధితులకు ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు చేయూతనిస్తున్నారు. ఈ క్రమంలో గత మూడు రోజులుగా నిత్యావసర సరుకులు అందజేస్తున్నారు. అందులో భాగంగా గురువారం కూడా విజయవాడలోని 42వ డివిజన్‌లో తిరుగుతూ బాధితులకు నిత్యావసర సరుకులను అందజేశారు. అలాగే కొంత నగదు సాయాన్ని చేశారు. అంతేకాకుండా వరద బాధితుల సమస్యలను తెలుసుకుని అక్కడికక్కడే పరిష్కరించేం దుకు చర్యలు తీసుకున్నారు. ఇదిలా ఉండగా గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ఎమ్మెల్యే అమిలినేనికి ఫోన్ చేసి వరద బాధితులకు సహాయం అందించాలని కోరారు. స్పందించిన అమిలినేని వెంటనే రెండు ట్రక్కుల్లో నిత్యావసర సరుకులు తీసుకెళ్లి పంపిణీ చేశారు. ఇప్పటివరకు ఆయన సుమారు రూ.40 లక్షల విలువగల నిత్యావసర సరుకుల్ని బాధితులకు పంచారు. అలాగే కళ్యాణదుర్గం నుంచి 250 మందికి పైబడి వెళ్లిన వలంటీర్లు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు వరద బాధితులకు అండగా ఉంటూ సహాయ సహకారాలు అందించారు.

రూ.1.26 లక్షల విరాళం..

తాడిపత్రి: విజయవాడ వరదబాధితుల సహాయార్థం తాడిపత్రి మెప్మా స్వయం సహాయక సంఘాలు రూ.1,26,500 విరాళం అందజేశారు. ఈ సందర్భంగా గురువారం ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డిని స్థానికంగా ఉన్న ఆయన నివాసంలోనే కలిసి చెక్కును అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ వరదబాధితులను ఆదుకోవడానికి ప్రతి ఒక్కరూ ముందుకురావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా స్వయంసహాయక సభ్యులను అభినందించారు.

విరాళాల సేకరణ

గుంతకల్లుటౌన్: విజయవాడలో వరద బాధితుల సహాయార్థం పట్టణంలోని సీపీఐ నాయకులు విరాళాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు గోవిందు మాట్లాడుతూ వరదల వల్ల విజయవాడ ప్రజలుతీవ్రంగా నష్టపోయారన్నారు. వారిని ఆదుకునేందుకు ప్రతిఒక్కరూ ముందుకురావాలని పిలుపునిచ్చారు. సేకరించిన విరాళాలను బాధితులకు అందజేస్తామన్నారు. అనంతరం మొయిన్‌రోడ్డు, పురవీధుల్లో విరాళాల సేకరణ చేశారు. కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ సహాయ కార్యదర్శి మహేష్, పట్టణ కార్యదర్శి గోపినాథ్,సహాయ కార్యదర్శి ఎస్ఎండీ గౌస్, మండల కార్యదర్శి రాము, సహాయ కార్యదర్శి రామాంజనేయులుయాదవ్, నాయకులు పాల్గొన్నారు. శ్రీ శంకరానందగిరి స్వామి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ గోపాల్, విద్యార్థులు, ఎన్‌సీసీ క్యాడెట్లు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, అధ్యాపకులు విరాళాల సేకరణ చేపట్టారు. కసాపురం రోడ్డు, మొయిన్ రోడ్డు, పాతబస్టాండ్, ఎన్టీఆర్ సర్కిల్, ధర్మవరంగేట్‌రోడ్డు, రైల్వేస్టేషన్‌రోడ్డులలో విరాళాలు సేరించారు.

ఉరవకొండ: పట్టణంలో నిస్వార్థ సేవాసంస్థ వారు విరాళాల సేకరణ చేపట్టారు. కార్యక్రమంలో గవిమఠం ఉత్తరాధికారి కరిబసవ రాజేంద్ర స్వామి పాల్గొన్నారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల నుంచి టవర్‌క్లాక్ కూడలి వరకూ విరాళాలు సేకరించారు. సేకరించిన విరాళాలను ముఖ్యమంత్రి సహాయ నిధికి పంపుతామని నిస్వార్థ సేవాసంస్థ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు వెంకట్, రాజేష్, గీతాప్రచారక్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కణేకల్లు: మండల కేంద్రంలోని శ్రీవిద్యానికేతన్ స్కూల్ వారు విరాళాల సేకరణ చేపట్టారు. పాఠశాల విద్యార్థులతోపాటు ఉపాధ్యాయులు పురవీధుల్లో తిరిగి విరాళాల సేకరణ చేపట్టారు. కరెస్పాండెంట్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

డీ.హీరేహాళ్, సెప్టెంబరు 12: మండలకేంద్రంలో అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని పోలీసులు గురువారం రాత్రి పట్టుకున్నారు. కొందరు అక్రమార్కులు పలు గ్రామాల్లో రేషన్‌బియ్యాన్ని సేకరించి మండల కేంద్రానికి సమీపంలో ఉన్న వెంకటేష్ అనే వ్యక్తి తోటలో భద్రపరచి అక్కడ నుంచి అర్ధరాత్రి సమయంలో కర్ణాటకకు తరలిస్తుంటారు. ఈ క్రమంలో గత వారం రోజులు గా వివిధ గ్రామాలలో లబ్ధిదారుల నుంచి కొనుగోలు చేసి సేకరించిన రేషన్‌బియ్యాన్ని అక్రమార్కులు మండలకేంద్రంలో ఆపిల్ ఐరన్ ఇండస్ట్రీ పక్కన ఉన్న వెంకటేష్ అనే వ్యక్తి తోటలో నిల్వఉంచారు. సమాచారం అందడంతో స్పెషల్ బ్రాంచ్ అధికారులు గురువారం ఘటనా స్థలానికి చేరుకుని ప్లాస్టిక్ బ్యాగుల్లో నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని గుర్తించారు. వెంటనే విషయాన్ని స్థానిక సబ్ ఇన్‌స్పెక్టర్ గురుప్రసాద్‌రెడ్డికి తెలియజేయగా.. ఆయన అక్కడికి చేరుకొని సుమారు 180 ప్యాకెట్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. అక్రమార్కులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రేషన్ దుకాణాలపై అధికారుల దాడులు

బెళుగుప్ప, సెప్టెంబరు 12: మండలంలోని రేషన్ దుకాణాలను గురువారం విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించి నిత్యావసర సరుకులను తనిఖీ చేశారు. రెండు బృందాలు అంకంపల్లి, కోనంపల్లి, బెళుగుప్పలో దుకాణాలపై దాడులు చేసి తనిఖీలు నిర్వహించారు. దుకాణాలకు సరఫరా అవుతున్న సరుకులు, నిల్వ ఉన్న సరుకులకు తేడాలు ఉండటంతో అంకంపల్లి, కోనంపల్లి దుకాణాల డీలర్లపై 6ఏ కేసులు నమోదు చేశామని విజిలెన్స్ సీఐ జమాల్ బాషా తెలిపారు. తనిఖీ నివేదికలకు స్థానిక తహసీల్దార్ కు అందజేశామన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ ఫణీందర్, ఏవో వాసుప్రకాష్, డీసీటీవో సురేష్ చౌదరి, ఆర్ఐ నగేష్, వీఆర్వో గోవిందప్ప తదితరులు పాల్గొన్నారు.

రేషన్ సరుకులు సక్రమంగా అందించాలి

ఉరవకొండ: లబ్ధిదారులకు రేషన్ సరుకులను సరిగా అందించాలని, లేకపోతే డీలర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దారు మహబూబ్‌బాషా హెచ్చరించారు. మండలంలోని చిన్నముష్టూరులో గల రేషన్‌షాప్‌ను ఆయన తనిఖీ చేశారు. అనంతరం మాట్లాడుతూ ఉరవకొండలో షాప్ నెం 19ను తనిఖీ చేసి 27క్వింటాళ్ల బియ్యం నిల్వలు ఉన్నట్లు గుర్తించామన్నారు. దీంతో ఆ షాపు డీలర్‌పై పోలీస్‌స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నమోదు చేయించామన్నారు. ప్రతి నెలా రేషన్ షాపుల ద్వారా డీలరు, ఎండీయూ ఆపరేటర్ లబ్ధిదారులకు సరుకులను సక్రమంగా అందించాలన్నారు. నిర్లక్ష్యం చేస్తే క్రిమినల్ చర్యలు తీసుకుంటామని అన్నారు.

పొలంలో పనిచేస్తూ మహిళ మృతి

కళ్యాణదుర్గంరూరల్, సెప్టెంబరు 12: పొలంలో పనులు చేస్తున్న మహిళ ఒక్కసారిగా కుప్పకూలి మృతిచెందింది. మండలంలోని మంగళకుంట గ్రామానికి చెందిన భారతి (28) గురువారం తన బంధువులతో కలిసి గ్రామ సమీపంలో వ్యవసాయ తోటకు కూలీపనులకు వెళ్లింది. పొలంలో పనిచేస్తుండగా కళ్లు తిరగడంతో స్పృహ తప్పి పడిపోయింది. వెంటనే తోటి కూలీలు భర్త వన్నూరుస్వామికి సమాచారం ఇచ్చారు. అతను ఆటో తీసుకుని పొలం వద్దకు వెళ్లి ఆమెను కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతురాలికి భర్త, కుమార్తె ఉన్నారు. గుండెపోటుతోనే మరణించి ఉండవచ్చునని కుటుంబ సభ్యులు భావిస్తున్నారు.

హుండీ లెక్కింపు

తాడిపత్రి, సెప్టెంబరు 12: మండలంలోని ఆలూరు రంగనాథస్వామి ఆలయంలో గురువారం హుండీ కానుకల లెక్కింపు నిర్వహించినట్లు ఆలయ అధికారులు తెలిపారు. 13 నెలలు భక్తులు హుండీలో వేసిన కానుకలను లెక్కించగా రూ.27.24 లక్షల ఆదాయం వచ్చినట్లు తెలిపారు.

వేరుశనగ పంపిణీపై విచారణ

గుంతకల్లుటౌన్, సెప్టెంబరు 12: మండలంలోని దోసలుడికి, మొలకలపెంట, ఓబుళాపురం గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో విత్తన వేరుశనగ పంపిణీపై జిల్లా వ్యవసాయాధికారి చిన్నమ్మ గురువారం విచారణ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈఏడాది ఖరీఫ్ సీజన్‌లో ఈ గ్రామాల్లోని రైతుసేవాకేంద్రాల్లో చేపట్టిన విత్తన వేరుశనగ పంపిణీలో అవకతవకలు జరిగాయని ఆరోపణలు వచ్చాయన్నారు. అందుకే రైతులను పిలిపించి విత్తనవేరుశనగ తీసుకున్నారా లేదా అని విచారించామన్నారు. వేలిముద్ర వేసి విత్తనాలు తీసుకుని పొలాల్లో సాగు చేశామని రైతులు చెప్పారన్నారు. కార్యక్రమంలో ఉరవకొండ ఏడీఏ పద్మజ, మండల వ్యవసాయ అధికారి స్వాతి, సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి సమస్యను తీర్చండి

విడపనకల్లు, సెప్టెంబరు 12: తెగిపడిన విద్యుత్ లేన్‌కు మరమ్మతు చేసి మండలంలోని పాల్తూరు, హావళిగి గ్రామాలకు తాగునీటి సమస్యను తీర్చాలని ఆయా గ్రామాల సర్పంచ్‌లు బ్యూలారాణి, సుంకమ్మ కోరారు. ఈ మేరకు గురువారం మండలకేంద్రంలో విద్యుత్ఏఈ సత్యంను కలిసి వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వారం రోజుల క్రితం బొల్లనగుడ్డం వద్ద పొలాల్లో విద్యుత్ స్తంభం విరిగిపడడంతో 11కేవీ విద్యుత్ లేన్ తెగిపోయిందని, దీంతో విద్యుత్ సరఫరా లేక తమ గ్రామాలకు నీటి సరఫరా ఆగి పోయిందని తెలిపారు. ఫలితంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కనుక విద్యుత్ సమస్యను పరిష్కరించి తమ గ్రామాలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాలని వారు కోరారు.

17న ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ

యాడికి, సెప్టెంబరు 12: మండలంలో ఈ నెల 17వ తేదీన జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ప్రభుత్వ వైద్యుడు శ్రీరామ్‌కుమార్ తెలిపారు. మండలకేంద్రంలోని ప్రభుత్వ వైద్యశాలలో గురువారం ఆయన ఆరోగ్యసిబ్బందితో సమావేశం నిర్వహించి మాట్లాడారు. నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా ఏడాది నుంచి 19 ఏళ్ల వయసు గల పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలను వేస్తామన్నారు. మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో మాత్రలను పంపిణీ చేస్తామన్నారు. ఆరోగ్య సిబ్బంది పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో వైద్యుడు పరమేశ్వర్, మలేరియా నివారణ సబ్ యూనిట్ అధికారి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

సాంస్కృతిక కార్యక్రమాలు

పెద్దవడుగూరు, సెప్టెంబరు 12: మండలంలోని చిత్రచేడు గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం మానసిక ఉల్లాసం కార్యక్రమంలో భాగంగా విద్యార్థుల కోసం పలు సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టారు. పొడుపుకథలు, నీతికథలు, హాస్యం, మీకు తెలుసా, జీవితసత్యాలు, కరెంట్ అఫైర్స్, గిన్నిస్‌రికార్డులు, ప్రపంచ వింతలు, జ్యోతిర్లింగాలు, అష్టాదశ శక్తిపీఠాలు తదితర విషయాలను విద్యార్థులకు వివరించారు. అనంతరం దేశభక్తిగీతాలు, పేరడీ సాంగ్స్, సినీగేయాలను వినిపించారు. కార్యక్రమంలో హెచ్ఎం మధుసూదన్‌రెడ్డి, ఏపీఓ ఫుల్లారెడ్డి, ఎంపీడీఓ కుళ్లాయిస్వామి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రైతులకు పెట్టుబడి రాయితీ అందించాలి

పెద్దవడుగూరు, సెప్టెంబరు12: రైతులకు పెట్టుబడి రాయితీ అందించాలని కోరుతూ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు దస్తగిరి రైతులతో కలిసి గురువారం సచివాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2023 ఖరీఫ్, రబీ ఇన్సూరెన్స్ ప్రకటించాలన్నారు. అన్నదాత సుఖీభవ కింద పెట్టుబడి సాయం రూ.20వేలు రైతుల ఖాతాల్లోకి జమచేయాలన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో సంఘం మండల ఉపాధ్యక్షుడు ఈశ్వర్‌రెడ్డి, నాయకులు సుధీర్‌రెడ్డి, గోవిందు, మస్తాన్, శేఖర్ తదితరులు ఉన్నారు.

కుష్టుపై అవగాహన సదస్సు

యాడికి, సెప్టెంబరు12: మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు గురువారం డిప్యూటీ పారామెడికల్ ఆఫీసర్ రామచంద్ర కుష్టు లక్షణాలు, నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. చర్మంపై స్పర్శ లేని మచ్చలు, మందమైన మెరిసే జిడ్డుగల చర్మం, అరచేతులు, అరికాళ్లల్లో స్పర్శలేకపోవడం, కనుబొమ్మలు, కనురెప్పల వెంట్రుకలు రాలిపోవడం తదితర లక్షణాలు కుష్టువ్యాధి సంబంధించినవి అన్నారు. బహుళ ఔషధ చికిత్సతో కుష్టును నయం చేయవచ్చునని తెలిపారు. సదస్సులో హెల్త్ సూపర్‌వైజర్ రాంప్రసాద్‌గౌడ్, ఏఎన్ఎం మరియమ్మ, ఎంఎల్‌హెచ్‌పీ సబిహా, యాడికి హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు నాగన్న పాల్గొన్నారు.

భూ సమస్యలను పరిష్కరించండి

కళ్యాణదుర్గంరూరల్, సెప్టెంబరు 12: దళిత గిరిజన భూ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకేహరి ఆర్డీవో రాణి సుష్మితను కోరారు. పట్టణంలో గురువారం ఆయన భూ బాధితులతో ఆర్డీఓను కలిసి మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీలకు చెందిన భూములను పలువురు ఆక్రమించుకున్నారని, న్యాయం కోసం పోలీసు రెవెన్యూ అధికారుల చుట్టూ తిరిగినా ప్రయోజనం లేదని వాపోయారు. కళ్యాణదుర్గం రూరల్ పరిధిలో అనేక భూసమస్యలు ఉన్నాయని, వాటిని పరిష్కరించాలని కోరారు. లేనిపక్షంలో భూ బాధితులతో కలసి పెద్దఎత్తున ఉద్యమాలు చేస్తామన్నారు. కార్యక్రమంలో తాలుకా అధ్యక్షుడు చెలిమప్ప, నాయకులు నారాయణ, మారెన్న, రామచంద్ర, గంగన్న, నారాయణ స్వామి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పౌష్టికాహార వారోత్సవాలు


పామిడిలో మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రామలక్ష్మి

గుంతకల్లుటౌన్, సెప్టెంబరు 12: పట్టణంలోని హనుమేష్ నగర్‌లో గల అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం పౌష్టికాహార మాసోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ సూపర్‌వైజర్ కృష్ణవేణి మాట్లాడుతూ.. బాలింతలు, గర్భిణులు తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. పౌష్టికాహారంతోనే రక్తహీనతను నివారించవచ్చన్నారు. తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ ఆయాలు, పలువురు గర్భిణులు పాల్గొన్నారు.

పామిడి: మండలకేంద్రంలోని 8వ వార్డులో గల అంగన్‌వాడీ కేంద్రం లో పౌష్టికాహార మాసోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రామలక్ష్మి మాట్లాడుతూ.. గర్భిణులు, బాలింతలు, కిశోరబాలికలు పోషక విలువలు కల్గిన ఆహారాన్ని తీసుకోవాలన్నారు. అప్పుడే రక్తహీనతను నివారించవచ్చన్నారు. అంగన్‌వాడీ వర్కర్లు జయంతి, షేకున్‌బీ, ఆయాలు మాబున్నీ, కీర్తి తదితరులు పాల్గొన్నారు.

బెళుగుప్ప: మండల కేంద్రంలోని 4వ అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార మాసోత్సవాలను కార్యకర్త చంద్రకళ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సురేఖ పా ల్గొని పౌష్టికాహారం తీసుకుంటే కలిగే ప్రయోజనాలపై గర్భిణులు, బాలింతలకు వివరించారు. సచివాలయం సిబ్బంది భాగ్యలక్ష్మి, మౌనిక, అనురాధ, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

పెద్దపప్పూరు: మండలంలోని పసలూరు, షేక్‌పల్లి గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహార మాసోత్సవాలు జరిగాయి. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నారాయణమ్మ మాట్లాడుతూ.. బాలింతలు, గర్భిణులు, కిశోరబాలికలు క్రమం తప్పకుండా పౌష్టికాహారాన్ని తీసుకోవాలన్నారు. అనంతరం మహిళలకు వంట కార్యక్రమం, మ్యూజికల్ చైర్స్ ఆటలు నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మండలస్థాయి క్రీడాపోటీలు

యల్లనూరు, సెప్టెంబరు12: మండలంలోని చిలమకూరు ఆదర్శ పాఠశాల మైదానంలో గురువారం మండలస్థాయి క్రీడాపోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ చంద్రశేఖర్ మాట్లాడుతూ.. ఈ పోటీల్లో యల్లనూరు, చిలమకూరు, కూచివారిపల్లి, తిమ్మంపల్లి పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారన్నారు. ఖోఖో, చెస్, హాకీ, యోగా వంటి పోటీలను నిర్వహించి విజేతలను ఎంపిక చేసినట్లు తెలిపారు.

ఉరవకొండ: వజ్రకరూరు మండలకేంద్రంలో గురువారం స్కూల్‌గేమ్స్ ఆధ్వర్యంలో అండర్-14, 17 బాలుర విభాగాల్లో మండలస్థాయి క్రీడా పోటీలు నిర్వహించారు. ఇందులో మండలంలోని వివిధ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. ఖోఖో, వాలీబాల్, కబడ్డీ, షటిల్, అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించారు. గడేహోతూరు జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులు ఖోఖో, అథ్లెటిక్స్ పోటీల్లో ప్రతిభ కనబరిచారు. హెచ్ఎం స్వర్ణలత, పీఈటీలు పాల్గొన్నారు.

నేడు క్రీడాపోటీలు

విడపనకల్లు: మండలంలోని గడేకల్లు గ్రామంలోని జిల్లాపరిషత్ పాఠశాలలో శుక్రవారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండల స్థాయి క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు పీడీ అయూబ్ బాషా గురువారం ప్రకటనలో తెలిపారు. అథ్లెటిక్స్, చెస్ పోటీలు జరగనున్నాయని, వివిధ గ్రామాలలోని పాఠశాలల విద్యార్థులు పాల్గొనాలి కోరారు. గెలుపొందిన వారికి అదేరోజు బహుమతులు ప్రదానం చేస్తామని అన్నారు.

పోలీసుల అదుపులో నిందితుడు

● హత్యకు దారితీసిన బీరుబాటిల్ గొడవ

అనంతపురం క్రైం,సెప్టెంబరు 12: నగరంలో బుధవారం రాత్రి జరిగిన హత్య కేసులో నిందితుడు పండ్ల తేజను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బీరు పగలకొట్టినందుకు జరిగిన గొడవే హత్యకు దారి తీసిందని వన్‌టౌన్ సీఐ రాజేంద్రనాథ్‌యాదవ్ తెలిపారు. భవనానీ నగర్‌కు చెందిన దేవరకొండ శ్రీధర్, నవోదయకాలనీకి చెందిన పండ్లతేజ సమీప బంధువులు. బుధవారం మధ్యాహ్నం సమయంలో ఇద్దరూ మరో ఇద్దరితో కలిసి బీరు, మద్యం తాగారు. ఈ సందర్భంలో శ్రీధర్ చేయి తగిలి బీరు బాటిల్ పగిలిపోయింది. దీంతో తేజ మరో బీరు తేవాలని కోరాడు. ఈ టైంలో ఎక్కడ దొరుకుతుంది మళ్లీ తెప్పిస్తాలేనని చెప్పడంతో ఆ వివాదం అక్కడితో సద్దుమణిగింది. రాత్రి సమయంలో నిమజ్జనం జరుగుతుండగా ఆ నలుగురు మరోసారి తాగడానికెళ్లారు. ఆ సమయంలో వారి వద్ద ఉన్న యువకుడు బీరు పగిలిన విషయం లేవనెత్తాడు. ఆ సమయంలో శ్రీధర్, తేజ మధ్య వాగ్వాదం జరిగింది. ఈ క్రమంలో తేజ కోపంతో తన వద్దనున్న కత్తితో శ్రీధర్ మెడపై ఒక వేటు వేశాడు. తీవ్ర రక్తగాయంతో కొన్ని అడుగులు ముందుకు నడిచి సచివాలయం ఎదుట పడిపోయాడు. ఘటనపై ఆరా తీసిన పోలీసులు తేజను అదుపులోకి తీసుకుని విచారించారు. రెండు నెలల క్రితం పవర్‌ఆఫీస్ సమీపంలో తేజ బైక్‌పై వెళ్తుండగా మరో బైక్ ఢీ కొట్టింది. ఆ సమయంలో అవతలి వారు డబ్బులివ్వాలని కోరగా... 'ఇవ్వను, ఏం చేసుకుంటారో చేసుకోమ'ని చెప్పాడు. దీంతో వారు తేజ ఫొటో తీసుకుని ఎప్పుడో ఒకసారి దొరికినపుడు నీ సంగతి చెబుతామని బెదిరించారని తెలిసింది. అప్పటి నుంచి కత్తి పెట్టుకుని తిరుగుతున్నట్లు పోలీసుల విచారణలో చెప్పుకొచ్చినట్లు సమాచారం. శుక్రవారం నిందితుడిని రిమాండ్‌కు తరలిస్తామని సీఐ తెలిపారు.

8వ రోజుకు చేరిన కార్మికుల సమ్మె


అర్ధనగ్న ప్రదర్శన చేస్తున్న కార్మికులు

కళ్యాణదుర్గం రూరల్, సెప్టెంబరు 12: సమస్యలు తీర్చాలని కోరుతూ పట్టణంలో శ్రీరామిరెడ్డి, సత్యసాయి తాగునీటి పథకాల కార్మికులు చేపట్టిన సమ్మె గురువారం నాటికి 8వ రోజుకు చేరింది. ఈ క్రమంలో వారు అర్ధనగ్న ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. గత ఏడు నెలల నుం చి జీతాలు, 21 నెలల ఈపీఎఫ్, ఈఎస్ఐ చెల్లించకపోవడంతో కుటుంబాలు నడపడమే కష్టంగా తయారైందన్నారు. తమ కష్టాలను గుర్తించి వెంటనే జీతాలు చెల్లించాలని కోరా రు. జీతాలు చెల్లిస్తే వెంటనే విధుల్లోకి చేరి ప్రజల దాహార్తిని తీరుస్తున్నామన్నారు.

దళితులపై దాడులను అరికట్టాలి

ఉరవకొండ, సెప్టెంబరు 12: జిల్లాలో దళితులపై జరుగుతున్న దాడులు, అత్యాచారాలను అరికట్టాలని ఎమ్మార్పీఎస్ నాయకులు.. ఎస్పీ జగదీష్‌ను కోరారు. అనంతపురంలో గురువారం వారు ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. అనంతరం మాట్లాడుతూ దళితులపై జరిగే దౌర్జన్యాలు, దాడులను అరికట్టాలని కోరామని, అందుకు ఎస్పీ సానుకూలంగా స్పందించినట్లు నాయకులు తెలిపారు. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజు, జిల్లా అధ్యక్షులు అక్కులప్ప తదితరులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ఉరవకొండ, సెప్టెంబరు 12: రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని మాజీ ఎంపీపీ సుంకరత్నమ్మ పేర్కొన్నారు. మండలంలోని అమిద్యాల గ్రామంలో గురువారం ఆమె ప్రభుత్వం రాయితీపై అందజేసే ప్రత్యామ్నాయ పంటల విత్తనాలను రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రైతుల కోసం ప్రభుత్వం ఉలవలు, అలసందలను రాయితీపై అందజేస్తోందన్నారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏవో శుభకర్, ఆర్ఎస్‌కే సిబ్బంది పాల్గొన్నారు.

ఆటో బోల్తా.. యువకుడి మృతి

ఉరవకొండ, సెప్టెంబరు 12: వజ్రకరూరు మండలం రాగులపాడు వద్ద గురువారం ఆటో అదుపుతప్పి బోల్తా పడడంతో కార్తీక్‌నాయక్(22) అనే యువకుడు మృతి చెందాడు. పామిడి మండలం పాల్యం తండాకు చెందిన యువకులు గణేష్ నిమజ్జనం నేపథ్యంలో అన్నదాన కార్యక్రమానికి సంబంధించిన సరుకులు తీసుకునేందుకు ఉరవకొండకు వచ్చారు. సరుకులు తీసుకుని గ్రామానికి వెళ్తుండగా రాగులపాడు వద్ద ఆటో అదుపుతప్పి బోల్తాపడింది. ప్రమాదంలో ఆటోలో ఉన్న కార్తీక్ కిందికి ఎగిరిపడ్డాడు. తీవ్ర గాయాలు కావడంతో చికిత్స కోసం ఉరవకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ప్రమాదంలో మరో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి.

అటవీ అధికారులకు నెమలి పిల్ల అప్పగింత

గుంతకల్లుటౌన్, సెప్టెంబరు 12: పట్టణంలోని పాతబస్టాండ్‌లో బంగారు దుకాణాల వద్ద గురువారం రాత్రి నెమలిపిల్ల ప్రత్యక్షమైంది. గమనించిన బంగారు దుకాణాల యజమానులు దానిని వన్‌టౌన్ పోలీసులకు అప్పగించారు. తర్వాత వన్‌టౌన్ పోలీసులు అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించి.. వారు రాగానే నెమలిపిల్లను అప్పగించారు.

ఘనంగా మారెమ్మదేవి వన మహోత్సవం

రాయదుర్గం రూరల్, సెప్టెంబరు 12: పట్టణంలో కోటవీధిలో వెలసిన మారెమ్మదేవి సిడిమాను మహోత్సవం అనంతరం శాంతిపూజలో భాగంగా వన మహోత్సవాన్ని ఆలయ కమిటీ పెద్దలు గురువారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా పూజారి బొమ్మయ్య అమ్మవారికి ప్రత్యేక అలంకరణ గావించి పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని జంతుబలులు ఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు. వాల్మీకి సంఘం పెద్దలు, ఆలయ కమిటీ వర్కింగ్ సభ్యులు ఆలయం వద్ద భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా అన్ని సౌకర్యాలు కల్పించారు.

ప్రతి ఒక్కరూ పరిశుభ్రత పాటించాలి

రాయదుర్గం రూరల్, సెప్టెంబరు 12: ప్రతిఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతను పాటించాలని వైద్యాధికారి రమేష్ సూచించారు. స్వచ్ఛ రాయదుర్గం కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని చంద్రబాబునాయుడు కాలనీలో గురువారం ఆయన వైద్యసిబ్బందితో కలిసి ప్రజలకు పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. వీధుల్లో చెత్తాచెదారం, మురుగునీరు లేకుండా చూసుకోవాలని, అలాగే దోమలు కుట్టకుండా జాగ్రత్తలు వహించాలని తెలిపారు. ఇక భోజనం చేసేముందు చేతులను శుభ్రంగా కడుక్కోవాలని, పరిశుభ్రమైన ఆహారాన్ని తీసుకోవాలని, అప్పుడే వ్యాధులు దరిచేరవని చెప్పారు. లింగవివక్షత నిర్మూలనపై ఆరోగ్య బోధకుడు కెంచె లక్ష్మీనారాయణ అవగాహన కల్పించారు. ఆడయినా, మగ అయినా ఇద్దరూ సమానమేనన్నారు. లింగ వివక్ష చూపరాదన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకులు శాంతికుమారి, సరోజ, మమత, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ఓంశాంతి నగర్‌లో ఎమ్మెల్యే పర్యటన


సమస్యలను వింటున్న ఎమ్మెల్యే అశ్మిత్‌రెడ్డి

తాడిపత్రి, సెప్టెంబరు 12: పట్టణంలోని ఓంశాంతి నగర్‌లో గురువారం ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఏమైనా సమస్యలు ఉంటే చెప్పాలని కోరారు. తాగునీరు సరిగా రాలేదని, అలాగే డ్రైనేజీ నీరు రోడ్లపై పారుతోందని, వీటితో ఇబ్బంది పడుతున్నామని పలువురు కాలనీవాసులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన ఆయన డ్రైనేజీ సమస్యను వెంటనే పరిష్కరించాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. తాగునీరు కూడా సక్రమంగా సరఫరా చేయాలని సూచించారు. ఆయన వెంట కదిరి టీడీపీ నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, హరినాథ్‌రెడ్డి, పవన్‌కుమార్‌రెడ్డి, మల్లికార్జునరెడ్డి, దిలీప్, సోమశేఖర్ నాయుడు, సుదర్శన్‌రెడ్డి, బాషా తదితరులు ఉన్నారు.